తొలివెలుగు జాతీయపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.

సెల్ : 9491134365

TGTEL/26/A6221

తొలి వెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయపత్రిక

TOLE VELUGGU JATIYAPATRIKA

విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయపత్రికలో పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతుంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9491134365

యాదాద్రి భువనగిరి	సంపుటి: 01	సంచిక : 53	శనివారం	19 సెప్టెంబర్ 2026	ఎడిటర్: యంజాల ప్రవీణ్	పేజీలు: 08	వెల: రూ.2/-
Yadadri Bhuvanagiri	Volume:01	Issue:53	Saturday	19 September 2026	Editor:Yamjala praveen	Pages:08	Cost:2/-

ప్రతిభా కేంద్రాలుగా ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు..

ఏఐ స్కిల్స్ తప్పనిసరి

- నిమ్మకూరులో ఐఐటీ-జేఈఈ/నీట్ అకాడమీ ఏర్పాటుకు ఆమోదం
- 10 రెసిడెన్షియల్ స్కూళ్లను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లుగా అభివృద్ధి చేయాలని నిర్ణయం
- విద్యార్థులకు ఏఐ స్కిల్స్‌తో పాటు కంప్యూటర్ ల్యాబ్స్ తప్పనిసరి
- సిబ్బంది పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలను (ఏపీఆర్ఎస్) ప్రతిభావంతులను తయారుచేసే అత్యుత్తమ కేంద్రాలుగా తీర్చిదిద్దాలని, మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా అంతర్జాతీయ ప్రమాణాలను నెలకొల్పాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో శుక్రవారం ఆయన అధ్యక్షతన ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ (ఝ్రా=జుxూ) 59వ గవర్నింగ్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రెసిడెన్షియల్ విద్యావ్యవస్థను

- మిగతా 2వ పేజీలో

దానంపై హైకోర్టు వేటు

- ఆయన పార్టీ ఫిరాయించినట్లు నిర్ధారణ.. శాసనసభ సభ్యత్వానికి అనర్హుడిగా ప్రకటన
- అసెంబ్లీ స్పీకర్ జారీ చేసిన ఉత్తర్వులు రద్దు చేస్తూ సీజే ధర్మాసనం సంచలన తీర్పు
- 2024 ఏప్రిల్ 23 నుంచి ఖైరతాబాద్ నియోజకవర్గ స్థానం ఖాళీగా ఉన్నట్లేనని వెల్లడి
- స్పీకర్ కార్యదర్శికి, కేంద్ర ఎన్నికల సంఘానికి తీర్పు ప్రతి పంపాలని రిజిస్ట్రీకి ఆదేశం
- అప్పీలుకు వీలుగా తీర్పు అమలు నిలిపివేయాలన్న దానం న్యాయవాది
- ఊరటనివ్వని ధర్మాసనం.. రాష్ట్ర చరిత్రలో కోర్టు వేటుపడ్డ తొలి ఎమ్మెల్యేగా నాగేందర్

హైదరాబాద్: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు చీఫ్ జస్టిస్ ధర్మాసనం సంచలన తీర్పునిచ్చింది. బీఆర్ఎస్ సభ్యుడిగా కొనసాగుతూ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసినందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 191 (2), రెడ్‌విత్ పదవ షెడ్యూల్‌లోని పేరా 2 (1)ఏ ప్రకారం 2024 ఏప్రిల్ 23 నుంచి రాష్ట్ర శాసనసభ సభ్యత్వానికి అనర్హుడిగా ప్రకటించింది. దానం పార్టీ మారలేదంటూ

పాక్ ఆరోపణలను తిప్పికొట్టిన భారత్

- యుద్ధనౌకల ఢీ ఘటనలో పాక్ ఆరోపణలను ఖండించిన భారత్
- నిబంధనలు ఉల్లంఘించి ప్రమాదకర విన్యాసాలు చేసింది పాకిస్థానేనని ఆరోపణ
- భారత నౌక ఐఎన్ఎస్ కోల్‌కతాకు పెద్దగా నష్టం జరగలేదని వెల్లడి
- తప్పు చేసి నిందను భారత్‌పై నెట్టేందుకు పాక్ ప్రయత్నిస్తోందని విమర్శ

తెలంగాణలో మళ్లీ వానలు: నేటి నుంచి 24 వరకు భారీ వర్షాలు

- బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా పెరగనున్న వానలు
- ములుగు, ఖమ్మం సహా పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ
- రాష్ట్రంలో ఇప్పటివరకు 19 శాతం లోటు వర్షపాతం నమోదు

2లో

రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వండి

కేంద్రాన్ని కోరుతూ శాసనసభ ఏకగ్రీవ తీర్మానం

- కరువు సహాయక చర్యలు, తాగు, సాగునీటి అవసరాలకు వినియోగిస్తాం
- ఎఫ్ఆర్‌బీఎం రుణ పరిమితిని జీఎస్‌డీపీలో 3 శాతం నుంచి 3.5 శాతానికి పెంచాలి
- వీబీజీ--రామ్‌జీ పథకంలో 125 రోజుల ఉపాధికి అదనంగా మరో 50 రోజులు పని కల్పించాలి
- అలాగే 1,500 మెగావాట్ల విద్యుత్ కేటాయించాలి
- అసెంబ్లీలో 8 అంశాలతో కూడిన తీర్మానం.. ఆమోదించిన సభ

హైదరాబాద్: 'తాగు, సాగునీటి అవసరాలు, కరువు నివారణ చర్యలకు కేంద్ర ప్రభుత్వం రూ.20 వేల కోట్ల ప్రత్యేక సహాయ ప్యాకేజీ మంజూరు చేయాలి. చెరువులు, నీటి వనరుల పునరుజ్జీవం, పురోగతిలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడానికి వివిధ కేంద్ర పథకాల కింద తగిన సహాయం అందించాలి' అని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ శాసనసభ ఏకగ్రీవ తీర్మానం చేసింది. శుక్రవారం శాసనసభలో ఎల్‌నినోపై లఘు చర్చ సందర్భంగా సభ్యులు లేవనెత్తిన అంశాలపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఎనిమిది అంశాలపై తీర్మానం ప్రవేశపెట్టగా, అన్ని రాజకీయ పార్టీలు ఈ తీర్మానానికి మద్దతు ఇవ్వాలని భట్టి కోరారు. అనంతరం సభ్యులు తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు.

- మిగతా 2వ పేజీలో

ఎన్‌టీఏను తనిఖీ చేస్తాం

- వ్యవస్థ ఎలా పనిచేస్తోందో మేమే స్వయంగా పరిశీలిస్తాం
- రెండు వారాల్లో నందన్ నిలేకని కమిటీ నివేదిక సమరి?పంచండి
- సిఫార్సులు కాగితాలకే పరిమితం కాకూడదు
- సగం మంది సిబ్బంది శాశ్వత ప్రాతిపదికన ఉండాల్సిందే
- పరీక్షల సంస్కరణలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

- మిగతా 2వ పేజీలో

కర్ణాటకలో తుళుకు రెండో అధికార భాషా హోదా

- మంగళూరులో తొలిసారి భేటీ అయిన రాష్ట్ర కేబినెట్
- తుళు ప్రజల దశాబ్దాల నాటి డిమాండ్‌కు ఆమోదం
- బీజేపీ హామీని నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం
- దక్షిణ కన్నడ జిల్లా పేరు మార్పునకు గ్రీన్ సిగ్నల్

మా ఆస్తులు తీసుకుని రూ. 1,000 కోట్లు ఇవ్వండి

- బీఆర్ఎస్ నాయకులను టార్గెట్ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్న కేటీఆర్
- హైదరాబాద్ అభివృద్ధి కోసం రాత్రింబవళ్లు ప్రయత్నించామని వెల్లడి
- కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల భూమి ఉందని అసత్య ప్రచారం చేశారని మండిపాటు

ఫార్ములా ఈ-రేస్ కేసులో నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టు విచారణకు హాజరైన అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల మేనిఫెస్టో హామీలను

- మిగతా 2వ పేజీలో

దుగరాజపట్నంలో భారీ షిప్‌యార్డ్.. రూ.15 వేల కోట్ల పెట్టుబడి!

- దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్
- ఎండీఎల్‌తో ఏపీ ప్రభుత్వ ఎంవోయూ
- ఐదేళ్లలో రూ.15 వేల కోట్ల పెట్టుబడి
- 45 వేల మందికి ఉపాధి అవకాశాలు
- ఏటా 12 లక్షల గ్రాస్ టన్నుల సామర్థ్యం

ఆంధ్రప్రదేశ్‌లో షిప్‌బిల్డింగ్ రంగానికి భారీ ఊతం లభించనుంది. దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్ ఏర్పాటు చేసేందుకు 'మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్' (ఎండీఎల్)తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో సచివాలయంలో ఎండీఎల్, 'నేషనల్ షిప్‌బిల్డింగ్ అండ్ హెవీ ఇండస్ట్రీస్ పార్క్-ఏపీ'

- మిగతా 2వ పేజీలో

అమరావతిలో మాస్ ట్రాన్స్‌పోర్టేషన్, అసెంబ్లీపై స్పైయర్ టవర్

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సీఆర్డీఏ 66వ అథారిటీ సమావేశం
- అసెంబ్లీ భవనంపై రూ.661 కోట్లతో స్పైయర్ టవర్ నిర్మాణానికి ఆమోదం
- రాజధాని గ్రామాల్లో మౌలిక వసతులకు రూ.1548 కోట్ల టెండర్లకు గ్రీన్ సిగ్నల్
- విజయవాడ-గుంటూరును కలుపుతూ మాస్ ట్రాన్స్‌పోర్ట్ వ్యవస్థకు ప్రణాళికలు
- ఎకరం లోపు రైతులకు కూడా యాన్యుటీ చెల్లింపునకు సమావేశం అంగీకారం

2లో

ప్రతిభా కేంద్రాలుగా ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు.. ఏఐ స్కిల్స్ తప్పనిసరి

సమూలంగా బలోపేతం చేసే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు అకడమిక్ ఎక్సలెన్స్‌పై దృష్టి సారించి, ప్రతిభావంతులను తయారు చేసే కేంద్రాలుగా మారాలి" అని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను తొలిసారిగా పత్రికా ప్రకటనల ద్వారా అభినందించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇప్పటివరకు రెసిడెన్షియల్ స్కూళ్లలో చదివిన వారిలో 27 మంది ఐఏఎస్‌లు, 20 మంది ఐపీఎస్‌లు, 13 మంది ఐఆర్ఎస్‌లు, నలుగురు ఐఎఫ్ఎస్‌లతో పాటు ఎందరో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని అధికారులు వివరించగా, మంత్రి లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో నైపుణ్య శిక్షణను తప్పనిసరి చేయాలని, అన్ని స్కూళ్లలో అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 10 ఏపీఆర్ విద్యాసంస్థలను 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'లుగా అభివృద్ధి చేసే ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపింది. ఇప్పటికే తాడికొండ, కొడిగినహళ్లి పాఠశాలలు ఈ జాబితాలో ఉన్నాయి. కృష్ణా జిల్లా నిమ్మకూరులోని ఏపీఆర్ జూనియర్ కళాశాలలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఐఐటీ-జేఈఈ/నీట్ అకాడమీని ఏర్పాటు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరో 6 రెసిడెన్షియల్ స్కూళ్లను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు కూడా సమావేశం ఆమోదముద్ర వేసింది. సిబ్బంది సంక్షేమానికి సంబంధించి కూడా పలు ముఖ్య నిర్ణయాలు తీసుకున్నారు. ఏపీ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సిబ్బంది పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచే ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపింది. గెస్ట్ ఫ్యాకల్టీ గౌరవ వేతనాలను ఇతర సొసైటీలతో సమానంగా పెంచడంతో పాటు, పీఈటీలను పీడీలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు అంగీకరించింది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయ, బోధనేతర సిబ్బంది నియామకాలకు స్టాఫింగ్ ప్యాట్రన్‌కు ఆమోదం తెలిపారు. అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లలో శాశ్వత భవనాలు, మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని, ఆటోమేటెడ్ స్మార్ట్ కిచెన్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. విద్యార్థుల వైద్య అత్యవసర పరిస్థితుల కోసం లక్ష రూపాయల వరకు ఖర్చు చేసే అధికారాన్ని సొసైటీ సెక్రటరీకి కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. జగ్గంపేట నియోజకవర్గంలోని భూపతిపాలెం రెసిడెన్షియల్ స్కూల్‌ను ప్రపంచస్థాయి క్రీడా హబ్‌గా తీర్చిదిద్దే అవకాశాలను పరిశీలించాలని లోకేశ్ ఆదేశించారు.

దానంపై హైకోర్టు వేటు

మార్చిలో స్పీకర్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తూ రిట్ పిటిషన్లను అనుమతించింది. బీఆర్ఎస్ సభ్యుడిగా ఉంటూ 2024లో కాంగ్రెస్ నుంచి సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థిగా దానం నాగేందర్ పోటీ చేశారని హైకోర్టు గుర్తుచేసింది. సంబంధిత శాసనసభ నియోజకవర్గ స్థానం ఖాళీగా మారినట్లు స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వుల ప్రతులను శాసనసభ స్పీకర్ కార్యదర్శికి, కేంద్ర ఎన్నికల సంఘానికి పంపించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ప్రజాప్రయోజనాల దృష్ట్యా అప్పీలుకు వీలుగా ఉత్తర్వుల అమలును నిలిపివేయాలంటూ దానం తరఫు న్యాయవాది అభ్యర్థించినప్పటికీ దీనిపై ఎలాంటి నిర్ణయం వెలువరించకుండానే ప్రత్యేక ధర్మాసనం విచారణ ముగించింది. పార్టీ మారినట్లు ప్రకటిస్తూ ఓ ఎమ్మెల్యేపై ఉన్నత న్యాయస్థానం అనర్హత వేయడం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి.

స్పీకర్ తీర్పును బీఆర్ఎస్, బీజేపీ సవాల్ చేయడంతో..

బీఆర్ఎస్ నుంచి గెలిచిన దానం నాగేందర్.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్‌లో చేరినందున ఆయనపై అనర్హత వేటు వేయాలంటూ స్పీకర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు చేయడం తెలిసిందే. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఈ అంశంపై విచారణ చేపట్టిన స్పీకర్ (ట్రిబ్యునల్ ఛైర్మన్ హోదాలో) దానం నాగేందర్ చట్టపరంగా పార్టీ మారలేదంటూ తీర్పునిచ్చారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన సీజే ధర్మాసనం గత నెల 21న తీర్పు రిజర్వు చేసింది. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ స్పెషల్ బెంచ్ శుక్రవారం కీలక తీర్పు వెలువరించింది. తీర్పు కాపీలో ధర్మాసనం పేర్కొన్న కీలకాంశాలు.. 2023లో బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి.. ఆ తర్వాత 2024లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన దానం నాగేందర్ శాసనసభ సభ్యత్వానికి అనర్హుడయ్యారు. 2024 ఏప్రిల్ 23 నుంచి ఆయన అనర్హత వర్తిస్తుంది. దీంతో ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న శాసనసభ స్థానం ఖాళీ అయినట్లే. రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ కింద అసెంబ్లీ స్పీకర్ ట్రిబ్యునల్‌గా వ్యవహరించినప్పుడు ఆయన నిర్ణయాన్ని పూర్తిగా న్యాయ సమీక్ష పరిధికి వెలుపల ఉంచలేం. కిహోటో హోలోహన్ వర్సెస్ జాచిల్లు కేసులో సుప్రీంకోర్టు 1992లో ఇచ్చిన తీర్పు ప్రకారం.. స్పీకర్ నిర్ణయంలో రాజ్యాంగపరమైన నిబంధనల ఉల్లంఘన, దురుద్దేశం, సహజ న్యాయ సూత్రాల ఉల్లంఘన వంటి లోపాలు ఉంటే ఆర్టికల్ 226 కింద హైకోర్టు జోక్యం చేసుకోవచ్చు.

ఎన్‌టీఏను తనిఖీ చేస్తాం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకత, సంస్కరణలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. 'నీట్'సహా పలు పరీక్షలు నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ప్రధాన కార్యాలయాన్ని తామే స్వయంగా తనిఖీ చేస్తామని తేల్చిచెప్పింది. పోటీ పరీక్షల సమగ్రతను పరిరక్షించేందుకు ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నిలేకని నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ పురోగతి నివేదికను సమర్పించాలని ఆదేశించింది. జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. హైపవర్డ్ కమిటీతో సమన్వయం చేసుకుంటున్న కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ(డీఓపీటీ) జాయింట్ సెక్రెటరీ కమిటీ పురోగతిపై రెండు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని పేర్కొంది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఎన్‌టీఏలో కార్యాలయాన్ని సందర్శిస్తామని జస్టిస్ పీఎస్ నరసింహ తెలిపారు. 'ఒకరోజు నేను, నా సోదర న్యాయమూర్తి జస్టిస్ అరాధేతో కలిసి ఎన్‌టీఏ ఆఫీసును సందర్శిస్తాం. వ్యవస్థ సరిగ్గా పని చేస్తోందా? లేదా? మానవ వనరులు సరిపడా ఉన్నాయా? లేదా? అన్నది మేమే స్వయంగా పరిశీలిస్తాం"అని స్పష్టం చేశారు. ఢిల్లీలోని మింటో రోడ్‌లో ఉన్న ఎన్‌టీఏ కార్యాలయానికి వెళ్లి, ఆ వ్యవస్థ వాస్తవంగా ఎలా పనిచేస్తోందో పరిశీలించి, సిబ్బంది, ఇతర ఏర్పాట్లను అంచనా వేయనున్నట్లు తెలిపారు. ఎన్‌టీఏలో కనీసం సగం మంది (50 శాతం) సిబ్బంది శాశ్వత ప్రాతిపదికన ఉండాలని, అందరినీ ఇతర విభాగాల నుంచి డిప్యుటేషన్‌పై తీసుకురాకూడదని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఇతర సంస్థలతో ఎన్‌టీఏకు ఉన్న సంబంధాలు, అవి పరస్పరం ఎలా సహకరించుకుంటున్నాయి,

రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వండి

2026--27 ఆర్థిక సంవత్సరానికి ఎఫ్ఆర్‌బీఎం రుణ పరిమితిని జీఎస్‌డీపీలో 3 శాతం నుంచి 3.5 శాతానికి పెంచాలి. తద్వారా ఉపశమన, నివారణ చర్యలకు అవసరమైన అదనపు వ్యయాన్ని రాష్ట్రం భరించేందుకు అవకాశం కల్పించాలి. రాష్ట్రానికి అదనంగా 1,500 మెగావాట్ల విద్యుత్ కేటాయించాలి. కేంద్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థల్లో కేటాయించకుండా ఉన్న కోటా నుంచి దీన్ని అందించాలి. విండో-- ఐ కింద 5 మిలియన్ టన్నుల బొగ్గు లింకేజీ నిర్ధారించి రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు రేక్‌ల లభ్యతను పెంచాలి. విద్యుత్ ట్రాన్స్‌మిషన్ చార్జీలను సడలించి, అవసరమైన సాయం అందించాలి. ఎల్‌నినో పరిస్థితులను క్షేత్రస్థాయిలో అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని వీలైనంత త్వరగా రాష్ట్రానికి పంపించాలి. జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి (ఎన్‌డీఆర్ఎఫ్) నుంచి తగిన సాయం మంజూరు చేయాలి. రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (ఎస్‌డీఆర్ఎఫ్)లో కేంద్ర వాటాను సత్వరమే విడుదల చేయాలి. పంట నష్టం/ఇన్‌పుట్ సబ్సిడీ, తాగునీరు, పశుగ్రాసం, పశు సంపద పరిరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ, చెరువులు, ఇతర జలవనరుల పునరుద్ధరణతోపాటు ఉపశమన చర్యలకు తగిన సహాయం అందించాలి. వీబీజీ--రామ్‌జీ పథకంలో 125 రోజుల పనిదినాలకు అదనంగా మరో 50 రోజుల ఉపాధి కల్పించాలి. ఈ పథకంపై ఖర్చును మొత్తం కేంద్ర ప్రభుత్వమే భరించాలి. రాష్ట్రంలో అమల్లో ఉన్న 60 రోజుల సీజనల్ సస్పెన్షన్ కాలాన్ని సడలించాలి. గ్రామీణ కుటుంబాలకు ఉపాధి భద్రత కల్పించేందుకు

లేబర్ బడ్జెట్‌ను తగినంతగా పెంచాలి. రాష్ట్రానికి అవసరమైన ఎరువులను సకాలంలో కేటాయించాలి. ప్రభావిత జిల్లాలకు ముందుగానే రేక్‌ల ద్వారా సరఫరా చేయాలి. పర్ డ్రాప్ మోర్ క్రాప్ (పీడీఎంసీ) కింద కేటాయింపులు పెంచి డ్రిప్ ఇరిగేషన్‌ను వేగంగా విస్తరించాలి. ఎంఐడీహెచ్ కింద కూరగాయల సాగు విస్తీర్ణం పెంపునకు ఆర్థిక సహాయం అందించాలి. ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను సబ్సిడీపై సరఫరా చేయాలి. రైతులు, బలహీన వర్గాల కుటుంబాలను ఆదుకోవడంతోపాటు తక్షణ సహాయ చర్యలు చేపట్టేందుకు కేంద్ర పథకాలు, కేంద్ర ప్రాయోజిత పథకాల కింద అదనపు ఆర్థిక సాయం అందించాలి. అందుకు అవసరమైన తీరుగా నిబంధనలను సడలించాలి.

దుగరాజపట్నంలో భారీ షిప్‌యార్డ్.. రూ.15 వేల కోట్ల పెట్టుబడి!

(మొదటి పేజీ తరువాయి)

(ఎన్ఎస్‌హెచ్ఐపీ-ఏపీ) మధ్య ఎంవోయూ జరిగింది. వచ్చే ఐదేళ్లలో ఈ ప్రాజెక్టుపై ఎండీఎల్ సుమారు రూ.15 వేల కోట్లు పెట్టుబడి పెట్టనుంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 45 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. షిప్‌బిల్డింగ్‌తో పాటు మెరైన్ ఇంజినీరింగ్, లాజిస్టిక్స్, సర్వీసులు, అనుబంధ పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ప్రతిపాదిత షిప్‌యార్డ్ ఏటా 12 లక్షల గ్రాస్ టన్నుల నౌకల నిర్మాణ సామర్థ్యంతో ఏర్పాటు కానుంది. ట్యాంకర్లు, బల్క్ క్యారియర్లు, కంటైనర్ నౌకలు, ఎల్ఎన్‌జీ క్యారియర్లు, భారీ ప్రత్యేక నౌకలను ఇక్కడ నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. అవసరాన్ని బట్టి భవిష్యత్‌లో సామర్థ్యాన్ని మరింత పెంచుకునే అవకాశం ఉంటుంది. దుగరాజపట్నంలో షిప్‌బిల్డింగ్-కమ్-పోర్ట్ క్లస్టర్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. టెక్నో-ఎకనామిక్ ఫీజిబిలిటీ రిపోర్ట్ ప్రకారం షిప్‌బిల్డింగ్, షిప్ రిపేర్ యార్డ్‌కు సుమారు రూ.29,254 కోట్లు, పోర్టు అభివృద్ధికి రూ.9,513 కోట్ల వ్యయం అవుతుందని అంచనా.

అమరావతిలో మాస్ ట్రాన్స్‌పోర్టేషన్, అసెంబ్లీపై స్పియర్ టవర్

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో కీలక ముందడుగు పడింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన 66వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేశారు. రాజధాని నగరానికి మకుటాయమానంగా నిలిచేలా అసెంబ్లీ భవనంపై 250 మీటర్ల ఎత్తైన స్పియర్ టవర్ నిర్మాణానికి అథారిటీ ఆమోదం తెలిపింది. స్పియర్ టవర్, లిఫ్టుల నిర్మాణం కోసం రూ.661 కోట్ల వ్యయానికి సమావేశం అంగీకారం తెలిపింది. ప్రజాస్వామ్యానికి దేవాలయమైన అసెంబ్లీ భవనంపై నిర్మించే ఈ స్పియర్, ప్రజలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా, ఓ వ్యూ పాయింట్‌తో సహా నిర్మించాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లోని ల్యాండ్ పూలింగ్ స్కీమ్ (ఎల్పీఎస్) జోన్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.1548 కోట్లతో టెండర్లు పిలిచేందుకు అథారిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రెండో దశ భూసమీకరణలోనూ ఎకరం కంటే తక్కువ భూమి ఉన్న చిన్న రైతులకు కూడా యాన్యుటీ చెల్లించే ప్రతిపాదనకు సమావేశం ఆమోదం తెలిపింది. దీంతో పాటు, హోటళ్లు, పాఠశాలలకు భూములు కేటాయిస్తూ మంత్రుల కమిటీ చేసిన సిఫార్సులకు కూడా అంగీకారం లభించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, రాజధాని పరిధిలో ప్రజా రవాణా వ్యవస్థకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విజయవాడ, గుంటూరు సహా సమీప ప్రాంతాలను కలుపుతూ భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా ఒక సమగ్ర మాస్ ట్రాన్స్‌పోర్టేషన్ ప్రణాళికను వెంటనే సిద్ధం చేయాలని ఆదేశించారు. అమరావతిని సెల్ఫ్ ఫైనాన్సింగ్ సిటీగా అభివృద్ధి చేస్తామని, భవిష్యత్ రెవెన్యూ మోడల్స్‌పై అధ్యయనానికి ఓ కమిటీని నియమిస్తామని తెలిపారు. విజయవాడ, గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి నగరాలను కలిపి అమరావతి ఒక మెగా సిటీగా రూపుదిద్దుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అమరావతి బ్రాండ్‌ను దేశ, విదేశాల్లో మార్మోగేలా విస్తృత ప్రచారం చేయాలని సీఎం పిలుపునిచ్చారు. ఇటీవల లడఖ్‌లో ఓ బాలుడు మన రాష్ట్ర బైకర్‌ను 'అమరావతి నుంచి వచ్చారా' అని అడగడమే ప్రజల మనసుల్లో రాజధాని ఎంతగా నాటుకుపోయిందో చెప్పడానికి నిదర్శనమని అన్నారు. "ప్రతీ పౌరుడూ ఇది నా నగరం అని భావించేలా అమరావతిని తీర్చిదిద్దాలి" అని ఆయన పేర్కొన్నారు. నగరంలో 50 శాతం పచ్చదనం, బయోడైవర్సిటీ ఉండేలా చర్యలు చేపట్టాలని, కొండలు, నీటి వనరులను సుందర ప్రాంతాలుగా అభివృద్ధి చేయడానికి బ్లూప్రింట్ సిద్ధం చేయాలని ఆదేశించారు.

కర్ణాటకలో తుళుకు రెండో అధికార భాషా హోదా

కర్ణాటక తీర ప్రాంత ప్రజల దశాబ్దాల కల సాకారమైంది. డీకే శివకుమార్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, తుళు భాషకు రాష్ట్ర రెండో అదనపు అధికారిక భాష హోదా కల్పిస్తూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. మంగళూరులో తొలిసారిగా నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు అధికారికంగా ఆమోదముద్ర వేశారు. తీరప్రాంత కర్ణాటకలోని దక్షిణ కన్నడ, ఉడిపి జిల్లాల్లో తుళు భాషకు విశేషమైన సాంస్కృతిక ప్రాధాన్యత ఉన్నప్పటికీ, అధికారిక గుర్తింపు కోసం దశాబ్దాలుగా నిరీక్షణ కొనసాగింది. రాజకీయంగా బీజేపీకి కంచుకోటగా ఉన్న ఈ ప్రాంతంలో, గతంలో ఆ పార్టీ ప్రభుత్వాలు సైతం తుళు భాషకు అధికార హోదా కల్పిస్తామని హామీ ఇచ్చాయి. ముఖ్యంగా 2008లో అప్పటి ముఖ్యమంత్రి బి.ఎస్. యడ్యూరప్ప ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చలేదు. ఈ నేపథ్యంలో, కాంగ్రెస్ ప్రభుత్వం అనూహ్యంగా ఈ హామీని నెరవేర్చడం రాజకీయంగా అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ, "గత ప్రభుత్వాలు ఈ నిర్ణయాన్ని ఎందుకు తీసుకోలేదనే విషయాన్ని నేను ప్రశ్నించను. మాకు ఒక స్పష్టమైన నిబద్ధత ఉంది. మేము భావోద్వేగాలతో రాజకీయం చేయం, ప్రజల ప్రయోజనాల కోసమే పని చేస్తాం" అని స్పష్టం చేశారు.

తెలంగాణలో మళ్లీ వానలు: నేటి నుంచి 24 వరకు భారీ వర్షాలు

వర్షాల కోసం ఎదురుచూస్తున్న తెలంగాణ ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) చల్లటి కబురు అందించింది. రాష్ట్రంలో నేటి (19వ తేదీ) నుంచి 24వ తేదీ వరకు పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. బంగాళాఖాతంలో సెప్టెంబర్ 19 సాయంత్రం నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఐఎండీ హైదరాబాద్ కేంద్రం తెలిపింది. ఇది క్రమంగా బలపడి దక్షిణ ఒడిశా-ఉత్తర ఆంధ్ర తీరాల వైపు కదులుతుందని, దీని ప్రభావంతో తెలంగాణలో వర్షాలు పుంజుకుంటాయని అంచనా వేసింది. ఈ వానాకాలంలో ఇప్పటివరకు రాష్ట్రంలో సాధారణం కన్నా 19 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఈ కొత్త అల్పపీడనంతో ఆ లోటు కొంతవరకు భర్తీ అయ్యే అవకాశం కనిపిస్తోంది. నేడు, రేపు.. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, సిద్దిపేట, మెదక్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. తర్వాతి రోజుల్లో ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్ సహా మరిన్ని జిల్లాలకు ఈ హెచ్చరికలు వర్తించనున్నాయి.

మా ఆస్తులు తీసుకుని రూ. 1,000 కోట్లు ఇవ్వండి

అమలు చేయడం వదిలేసి, బీఆర్ఎస్ నాయకులను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ఏకైక లక్ష్యంగా మారిందని ఆయన ఆరోపించారు. కేసీఆర్ కుటుంబం రూ. లక్ష కోట్లు కొల్లగొట్టిందని సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను ప్రస్తావిస్తూ కేటీఆర్ ఒక సంచలన ఆఫర్ విసిరారు. "మా కుటుంబ ఆస్తులన్నింటినీ ప్రభుత్వమే తీసుకుని, దానికి ప్రతిఫలంగా మాకు రూ. వెయ్యి కోట్లు ఇస్తే ఎక్కడ సంతకం పెట్టమన్నా పెడతాను. మిగిలిన రూ. 99,000 కోట్లతో ప్రజలకు ఇచ్చిన హామీలను, సంక్షేమ పథకాలను అమలు చేయండి" అని సవాల్ చేశారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం, పెట్టుబడులను ఆకర్షించేందుకు తాము రాత్రింబవళ్లు ప్రయత్నిస్తే, తమపై అక్రమ కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే భూకేటాయింపుల ఆరోపణలపై మాట్లాడుతుండగా, గతంలో కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల భూమి ఉందంటూ అసత్య ప్రచారం చేశారని, కానీ ఇటీవల అసెంబ్లీ వేదికగా రేవంత్ రెడ్డి స్వయంగా కేసీఆర్‌కు ఉన్నది కేవలం 67 ఎకరాలేనని ఒప్పుకున్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా బెదిరేది లేదని, న్యాయపరంగానూ, రాజకీయంగానూ ఈ వేధింపులను ఎదుర్కొంటామని కేటీఆర్ స్పష్టం చేశారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- చిన్నగూడూరులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
- అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి: సర్పంచ్ బత్యం రమేశ్

తొలివెలుగు, చిన్నగూడూరు : గ్రామంలోని అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ బత్యం రమేశ్ తెలిపారు. శుక్రవారం చిన్నగూడూరు మండల కేంద్రంలో రేషన్ డీలర్ శ్రీదేవితో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ ఆదేశాల మేరకు మండలంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని వేగవంతం చేసినట్లు తెలిపారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలు సకాలంలో అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సుధాగాని నగేష్, వార్డు సభ్యుడు జీనక శేఖర్, నాయకులు జి.శ్రీనివాస్, అనిల్, దాసరి శ్రీనివాస్, జి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

'వారం రోజుల్లో వస్తా'నని చెప్పి.. వ్యక్తి అదృశ్యం

- హయత్‌నగర్ పోలీసులకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు

తొలివెలుగు, హయత్‌నగర్ : వారం రోజుల్లో తిరిగి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన గౌరంగ్ సాహూ (60) రామోజీ ఫిల్మ్‌సిటీలోని మెకానికల్ విభాగంలో పనిచేస్తున్నారు. గత ఆరు నెలలుగా ఇనాంగూడలోని బొడిగె కిష్టయ్య ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. సెప్టెంబర్ 5న మధ్యాహ్నం 12 గంటల సమయంలో గౌరంగ్ సాహూ తన కుమారుడు పరేష్ కుమార్‌కు ఫోన్ చేసి తాను భువనేశ్వర్ నుంచి భద్రక్ వైపు వెళ్తున్నానని, వారం రోజుల్లో తిరిగి వస్తానని తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులు పలుమార్లు ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. వారం రోజులు గడిచినా ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో కుమారుడు పరేష్ కుమార్ హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గౌరంగ్ సాహూ ఆచూకీ తెలిసిన వారు హయత్‌నగర్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

సమన్వయంతోనే పల్లెల సమగ్ర ప్రగతి

- రాజాపేటలో అధికారులతో మండల ప్రత్యేక అధికారి సమీక్ష
- హౌసింగ్ ఏఈపై సర్పంచుల ఆగ్రహం.. రాజకీయ పోస్టులపై అభ్యంతరం
- ఏఈని సస్పెండ్ చేయాలని నేడు ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా

తొలివెలుగు, రాజాపేట : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసినప్పుడే గ్రామాలు సమగ్ర అభివృద్ధి సాధిస్తాయని మండల ప్రత్యేక అధికారి బి. దేవ్‌సింగ్ అన్నారు. రాజాపేట మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం సర్పంచులు, వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో నాగవేణితో కలిసి మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పెండింగ్ అంశాలపై శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు సకాలంలో అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. అధికారిక వాట్సాప్ గ్రూపులో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వ్యతిరేకంగా పోస్టులు పెట్టారంటూ హౌసింగ్ ఏఈ వివేక్‌పై పలువురు సర్పంచులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ రాజకీయపరమైన వ్యాఖ్యలు చేయడం నిబంధనలకు విరుద్ధమని సర్పంచులు పల్లె సంతోష్‌గౌడ్, చింతల సంపత్, బొడ్డు భాస్కర్, ఇండ్ల రాజయ్య, అనూష పేర్కొంటూ ఏఈపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల వ్యవహారంలో బూరుగుపల్లి సర్పంచ్ చింతల సంపత్‌పై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని హౌసింగ్ ఏఈ వివేక్ సమావేశంలో స్పష్టం చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ రాజకీయపరమైన పోస్టులు పెట్టిన హౌసింగ్ ఏఈ వివేక్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

టీటీడీ నెయ్యి కల్తీ కేసు.. మరో కీలక నిందితుడిని అరెస్ట్ చేసిన ఈడీ

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నెయ్యి కల్తీ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును వేగవంతం చేసింది. ఈ కేసుతో సంబంధం ఉన్న సుకృతి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రమోటర్ కైలాష్ చంద్ మంగ్లాను హైదరాబాద్ ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద ఆయనను అదుపులోకి తీసుకున్న అధికారులు, అనంతరం విశాఖపట్నంలోని పీఎంఎల్‌ఏ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం నిందితుడికి జ్యుడీషియల్ కస్టడీ విధించింది. టీటీడీకి సరఫరా చేసే నెయ్యిలో భారీస్థాయిలో కల్తీ జరిగిందనే ఆరోపణలతో తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్‌ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు చేపట్టింది. పామాయిల్, పామోలిన్, ఇతర రసాయనాలు కలిపి తయారు చేసిన నకిలీ నెయ్యిని, "అగ్‌మార్క్ స్పెషల్ గ్రేడ్ ఆవు నెయ్యి"గా నమ్మబలుకుతూ టీటీడీకి సరఫరా చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. 2019 నుంచి 2024 మధ్య కాలంలో సుమారు రూ. 230 కోట్ల విలువైన కల్తీ నెయ్యిని నిందితులు సరఫరా చేసినట్లు ఈడీ గుర్తించింది.

నిబంధనలు పాటిద్దాం.. ఉత్సవాలను సురక్షితంగా జరుపుకుందాం

- గణేష్ మండపాల వద్ద నాగోల్ పోలీసుల అవగాహన సదస్సులు

తొలివెలుగు, నాగోల్ : వినాయక ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా నిర్వహించుకోవాలని నాగోల్ సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ సూచించారు. బండ్లగూడలోని రాజీవ్ సహభావన అపార్ట్‌మెంట్స్, తట్టి అన్నారంలోని అన్నవరపు సత్యనారాయణ కాలనీల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్ద నాగోల్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీఐ సూచించారు. మత్తు పదార్థాలను విక్రయించే వారి వివరాలు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల నుంచి వచ్చే లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు. ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలను ఇతరులకు వెల్లడించవద్దని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించేవారు సీటుబెల్ట్ పెట్టుకోవాలని పోలీసులు సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, రాంగ్‌రూట్‌లో ప్రయాణించడం ప్రమాదకరమని హెచ్చరించారు. గణేష్ మండపాల వద్ద వాహనాలను రోడ్డుపై నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని పోలీసులు సూచించారు. ఉత్సవాలకు వచ్చే మహిళలు, చిన్నారుల భద్రతకు నిర్వాహకులు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమాల్లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మల్లారెడ్డి, ఎస్సైలు దశరథ, సూర్య, హెచ్‌సీ నర్సింహ, సహచారి లక్ష్మీకవిత పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉన్న భర్తకు సేవలు చేస్తూ టీచర్ మృతి

- నుంచి అధిక హయత్ నగర్ - హయత్‌నగర్‌లో విషాద ఘటన.. కేసు నమోదు

తొలివెలుగు, హయత్‌నగర్: హయత్‌నగర్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. వర్డ్ అండ్ డీడ్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్న సుజాత (52) శుక్రవారం మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం.. సుజాత భర్త స్వామి గత తొమ్మిదేళ్లుగా అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యారు. భర్తకు సేవలు చేస్తూ కొంతకాలంగా సుజాత మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 6.15 గంటల సమయంలో సుజాత వెంటనే ఆమెను కిందకు దించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు గుర్తించారు. మృతిపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. మృతురాలి పెద్ద కుమార్తె వినయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శిగా నీలకంఠం రాజు

- నియామక పత్రం అందజేసిన డైరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి

తొలివెలుగు, చిట్యాల : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) సోషల్ మీడియా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామానికి చెందిన నీలకంఠం రాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం తెలంగాణ డైరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నీలకంఠం రాజు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సోషల్ మీడియా వేదికగా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. పార్టీ సోషల్ మీడియా విభాగాన్ని క్షేత్రస్థాయి నుంచి మరింత పటిష్టం చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య రాష్ట్ర మహాసభ ఉపాధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విజయసాయి నీతులు చెప్పడమా? చిత్తశుద్ధి ఉంటే జగన్‌పై అప్రూవర్‌గా మారాలి: వర్ల రామయ్య

- విజయసాయి రెడ్డి 'అవినీతి రహిత పాలన' అనడంపై వర్ల రామయ్య ధ్వజం
- జగన్ అవినీతి నిజంగా తప్పనిపిస్తే అప్రూవర్‌గా మారాలని డిమాండ్
- 12 ఛార్జ్‌షీట్లలో నిర్దోషిగా తేలిన తర్వాతే ప్రజల్లోకి రావాలని సవాల్
- చంద్రబాబు తెలుగు జాతి సంపద అని, జగన్‌తో పోల్చొద్దని హితవు
- 'మూడో ప్రత్యామ్నాయం' అనేది ఉనికి కోసం ఆడుతున్న నాటకమని విమర్శ

జగన్ అవినీతి కేసుల్లో ఏ-2 నిందితుడిగా ఉన్న విజయసాయి రెడ్డి 'అవినీతి రహిత పాలన', 'మూడో ప్రత్యామ్నాయం' అంటూ నీతులు చెప్పడం దయ్యాలు వేదాలు వల్లించినట్లుందని టీడీపీ ఎమ్మెల్సీ వర్ల రామయ్య తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రూ.43 వేల కోట్ల ప్రజాధనం లూటీ కేసుల్లో జగన్‌తో పాటు సహ నిందితుడిగా ఉన్న వ్యక్తి, ఇప్పుడు జగన్ అవినీతిని పరోక్షంగా తప్పుబడుతున్నారని, ఆయనకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే సీబీఐ కేసుల్లో 'అప్రూవర్'గా మారి జగన్‌కు శిక్ష పడేలా చేయాలని సూటి సవాల్ విసిరారు. శుక్రవారం మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వర్ల రామయ్య మాట్లాడుతూ విజయసాయి రెడ్డి తీరుపై నిప్పులు చెరిగారు. "జగన్ తో కలిసి అడుగడుగునా అవినీతికి పాల్పడి, సీబీఐ చేతిలో అరెస్ట్ అయి, చంచల్‌గూడ జైల్లో 16 నెలలు సహ ఖైదీగా గడిపిన చరిత్ర విజయసాయి రెడ్డిది. గతంలో మాయమాటలతో జగన్‌ను గద్దెనెక్కించి, ఐదేళ్ల పాటు ఆయన వెనకుండి రాష్ట్రాన్ని సర్వనాశనం చేయడంలో ప్రధాన సూత్రధారి ఈయనే. ఇప్పుడు అదంతా మరిచిపోయి 'మూడో ప్రత్యామ్నాయం' తెస్తాననడం సిగ్గుచేటు. 12 సీబీఐ ఛార్జ్‌షీట్లలో నిందితుడిగా ఉండి, 12 ఏళ్లుగా కోర్టు విచారణకు హాజరుకాకుండా వాయిదాలు వేయిస్తున్న వ్యక్తి, స్వేచ్ఛగా తిరుగుతూ రాజకీయం మాట్లాడటం చూస్తే న్యాయవ్యవస్థ ఎంత సరళంగా ఉందో అర్థమవుతోంది" అని వర్ల రామయ్య ఎద్దేవా చేశారు.

నాడు జగన్‌ను తయారుచేసి.. ఇప్పుడు యువతను ఉద్ధరిస్తారా?

అవినీతికి బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచిన విజయసాయిరెడ్డి, ఇప్పుడు 'మెరికల్లాంటి యువతను తెస్తాం' అనడం హాస్యాస్పదంగా ఉందని వర్ల రామయ్య విమర్శించారు. "అవినీతి రహిత యువతను తయారు చేస్తానంటున్న విజయసాయికి ఆ అర్హత ఎక్కడిది? గతంలో మీరు తయారు చేసింది జగన్మోహన్ రెడ్డినే కదా? ఆయన అవినీతికి 'ఓం' అని దిద్దింది మీరే. మీ చార్టర్డ్ అకౌంటెంట్ నైపుణ్యాన్ని రాష్ట్రాన్ని లూటీ చేసేందుకే ఉపయోగించి, జగన్‌ను ఒక పెద్ద 'అవినీతి సామ్రాట్'గా తీర్చిదిద్దారు. జగన్ లాంటి ప్రొడక్ట్‌ను తయారుచేసిన వ్యక్తి నుంచి వచ్చే యువత ఎలా ఉంటారు? మీ కొత్త పార్టీ అధికారంలోకి వస్తే రాయలసీమను 'రతనాల సీమ' చేస్తామంటున్నారు. మరి ఐదేళ్లు అధికారం మీ చేతిలో ఉన్నప్పుడు ఏం చేశారు? మీ అసమర్థత వల్లే సీమ వెనుకబడిందనే నిజం ప్రజలకు తెలియదా?" అని వర్ల రామయ్య ప్రశ్నించారు. "రాయలసీమ ఒరిజినల్ రెడ్ల పౌరుషాన్ని కాపాడుతాం" అని మాట్లాడటంపై మండిపడుతూ, "అంటే మీ ఉద్దేశంలో ఐదేళ్లు రాష్ట్రాన్ని ఏలిన జగన్ ఒరిజినల్ రెడ్డి కాదా? ఆయన దొంగ రెడ్డా?" అని నిలదీశారు.

నిర్దోషిగా తేలాకే ప్రజల్లోకి రా!

విజయసాయి రెడ్డికి నిజంగా ప్రజల్లోకి రావాలని ఉంటే, ముందు తనపై ఉన్న 12 ఛార్జ్‌షీట్లలో నిర్దోషిగా బయటకు రావాలని వర్ల రామయ్య సవాల్ విసిరారు. "కోర్టుకు వెళ్లి నా కేసులను రోజువారీ విచారించి, నన్ను నిర్దోషిగా ప్రకటించమని తీర్పు తెచ్చుకో. అప్పుడు ప్రజల్లోకి వస్తే నిన్ను నమ్మే అవకాశం ఉంటుంది. అంతేకానీ, తీవ్రమైన అవినీతి ముద్రతో ప్రజలను మోసం చేయాలని చూస్తే కుదరదు" అని స్పష్టం చేశారు.

చంద్రబాబు తెలుగు జాతి సంపద

చంద్రబాబు తెలుగు జాతి గర్వించదగ్గ మహా సంపద అని, ఆయనతో జగన్, విజయసాయి వంటి వారిని పోల్చడం సిగ్గుచేటని వర్ల రామయ్య అన్నారు. "2019లో చంద్రబాబు గారే సీఎంగా కొనసాగి ఉంటే, ఈపాటికి ఏపీ గుజరాత్‌తో పోటీపడేది. కానీ మీరు తయారుచేసిన అవినీతి డైనోసార్ వల్ల రాష్ట్రం పదేళ్లు వెనక్కి వెళ్లింది. రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం పెంచాలని తపించే చంద్రబాబు ఎక్కడ? అవినీతిలో పుట్టి, అవినీతిలో పెరిగిన జగన్ ఎక్కడ? చంద్రబాబు విశ్వసనీయత చూసే నేడు రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయి. వరదలో కొట్టుకుపోయేవాడు గడ్డిపరకను పట్టుకున్నట్లు, ఉనికి కోసం విజయసాయి రెడ్డి 'మూడో ప్రత్యామ్నాయం' నాటకం ఆడుతున్నారు. చంద్రబాబు గారి ప్రజా పాలనపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారు" అని వర్ల రామయ్య హెచ్చరించారు.

గోపన పాలెం లో వినాయక చవితి ఉత్సవాలు

ఏలు రూ: గోపన్న పాలెం లో వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుగుతున్నాయి. స్వామివారిని జనసేన దెందులూరు మండల నాయకులు గోపన్నపాలెం గ్రామం మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు తోట రామకృష్ణ స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. శుక్రవారం స్వామివారిని అంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు

ఘనంగా చేలసాని శ్రీధర్ పుట్టిన రోజు వేడుకలు

ఏలూరు : ప్రముఖ వ్యాపారవేత్త దాత చలసాని శ్రీధర్ పుట్టిన రోజు వేడుకలు శు క్రవారం గోపన పాలెం ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. టిడిపి సీనియర్ నాయకులు మాగంటి నారాయణ ప్రసాద్ మిల్లు బాబు చందు శ్రీధర్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

21న ఆడమిల్లిలో తొమ్మిది కేజీల డ్రైఫ్రూట్ 2లడ్డూలు వేలంపాట



ఏలూరు : ఆడమిల్లి గ్రామంలో ఈనెల 21న కోదండ రామాలయం సాయంత్రం ఏడు గంటలకు తొమ్మిది కేజీల డ్రైఫ్రూట్ 2లడ్డు లువేలంపాట జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు అన్నారు. 16వ వార్షికోత్సవ వేడుకలు సందర్భంగా దాతలు హైదరాబాద్ ఈశ్వర్ జంగారెడ్డిగూడెం మరిదు దుర్గాప్రసాద్ హైదరాబాదు లోహనీ స్వీట్స్ లో గతంలో 36 లక్షల రూపాయలకు వేలంపాట కు వెళ్లిన లడ్డూలు చేసిన నిర్వహకులతోచేయించిన తొమ్మిది కేజీల డ్రై ఫ్రూట్ లడ్డూలు వేలం పాట జరుగుతుందని సమీప గ్రామాల్లోని భక్తులు ఈ వేలంపాటలో పాల్గొవాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు

భీమవరం--లోసరి రహదారి నిర్మాణానికి ఆక్రమణల తొలగింపుపై చర్యలు చేపట్టాలి

రూ.43 కోట్ల సీ ఆర్ ఎఫ్ నిధులతో నాలుగు లైన్ల రహదారి నిర్మాణం

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం, సెప్టెంబర్ 18: భీమవరం పట్టణం నుంచి లోసరి వరకు రహదారి నిర్మాణానికి అవసరమైన ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం భీమవరం పట్టణం నుంచి లోసరి వరకు రహదారి నిర్మాణం కోసం చేపడుతున్న ఆక్రమణల తొలగింపు ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భీమవరం పట్టణం నుంచి లోసరి వరకు రహదారి నిర్మాణానికి ప్రభుత్వం సీ ఆర్ ఎఫ్ నిధుల నుంచి రూ.43 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఈ నిధులతో భీమవరం నుంచి లోసరి వరకు నాలుగు లైన్ల రహదారిని నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. రహదారి నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని సిద్ధం చేయడంతో పాటు ఆక్రమణల తొలగింపు ప్రక్రియను నిబంధనల ప్రకారం వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భీమవరం పట్టణంలోని డీ.ఎన్.ఆర్. కళాశాల, కే.జీ.ఆర్. కళాశాల వద్ద అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ.17.45 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా గొల్లవానిదిబ్బ నుంచి రామాయణపురం వరకు రహదారి విస్తరణకు రూ.7.25 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. తోకతిప్ప, నాగేంద్రపురం ప్రాంతాల్లో రూ.8 కోట్ల వ్యయంతో బ్రిడ్జిల నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. భీమవరం నుండి లోసరి రహదారిలో ప్రభుత్వం మంజూరు చేసిన అప్రోచ్ రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణ ప్రాంతాలను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను నిర్దేశిత ప్రమాణాలు, నాణ్యతతో చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భీమవరం రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రవీణ్ కుమార్ రెడ్డి, భీమవరం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, ఆర్అండ్‌బీ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హి సేవా --2026ను జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలి

స్వచ్ఛతా హి సేవా--2026 గోడ పత్రికలను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి,జిల్లా జాయింట్ కలెక్టర్ కె ఆర్ కల్పశ్రీ

మొగల్తూరు సెప్టెంబరు 18: జిల్లాలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. శు క్రవారం మొగల్తూరు ఎంపీడీవో కార్యాలయంలో స్వచ్ఛతా హి సేవ--2026 గోడ పత్రికలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్ప శ్రీ, తో పాటు ఆర్డీవో దాసిరాజు, డిపిఓ వై దోసిరెడ్డి, స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు జిల్లా అధికారి ఏ వెంకటలక్ష్మి, హౌసింగ్ పిడి జి. పిచ్చయ్య, డి ఎల్ డి వో శ్యామల, ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి, మాట్లాడుతూ స్వచ్ఛతా హిసేవా ప్రతి ఒక్కరి బాధ్యత అని, పరిసరాలను పరిశు భ్రంగా ఉంచడంతో పాటు ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 17 వరకు నెల రోజుల పాటు నిర్వహించే స్వచ్ఛతా హిసేవా --2026 కార్యక్రమంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు, పట్టణ స్థానిక సంస్థలు, మండల స్థాయి అధికారులు, విద్యా సంస్థలు, స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, యువత, విద్యార్థులు, పారిశుద్ధ్య కార్మికులు, ప్రజలను భాగస్వాములను చెయ్యాలని సూచించారు. స్వచ్ఛతను కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా ప్రజల జీవన విధానంలో భాగంగా మార్చేలా విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, పరిశుభ్రమైన పరిసరాల పరిరక్షణ, ప్రజల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించేలా కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

62 అడుగుల మట్టి గణనాథుని దర్శించుకున్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహం ఏర్పాటు అభినందనీయం

పాలకొల్లు: సెప్టెంబర్ 18: పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ 62 అడుగుల మట్టి గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. పాలకొల్లు పట్టణంలోని లాకు సెంటర్ రెల్లి పేటలో రెల్లి యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 62 అడుగుల గణనాథుని మట్టి విగ్రహాన్ని శు క్రవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా రెల్లి యువజన సంఘం మహిళలు దారి పొడవునా పూలు జల్లుతూ కలెక్టర్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనం అందుకున్నారు. రెల్లి పేటలో మహిళలు, ఉత్సవ కమిటీ సభ్యులతో కలెక్టర్ నాగరాణి ఎంతో ఆప్యాయంగా మాట్లాడారు. వారి కోరిక మేరకు వారితో కలిసి ఫొటోలు దిగడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా 62 అడుగుల మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు వాటర్ పెయింట్స్ మాత్రమే వినియోగించడం శు భపరిణామమని అన్నారు. ఇందుకు ఉత్సవ కమిటీ సభ్యులను ఆమె అభినందించారు. గణనాథుని విగ్రహాన్ని తయారు చేసిన శిల్పి ఇంటి ప్రసాద్‌ను కూడా కలెక్టర్ అభినందించారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులు పశ్చిమగోదావరి జిల్లా ప్రజలందరిపై ఉండాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, సీఐ రజనీకుమార్, రెల్లి యువజన సంఘం సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

120 మంది మహిళలకు సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్.....

శ్రీ తారకాపురి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు

తణుకు, ,సెప్టెంబర్ 18: మహిళల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా శ్రీ తారకాపురి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 120 మంది మహిళలకు సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్ మెడికల్ క్యాంపు నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బెజవాడ సూరిబాబు ఆధ్వర్యంలో, కార్యదర్శి రామ్‌కుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. వావిలాల వెంకట రమేష్, సరళాదేవి దంపతుల సౌజన్యంతో, డాక్టర్ సత్యవతి వైద్య సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ శ్రీ తారకాపురి లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలను అభినందించారు. మహిళల ఆరోగ్య పరిరక్షణకు ఉపయోగపడే సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్‌ను అందించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం కొంతమేరకు వ్యాక్సిన్‌ను అందిస్తున్నప్పటికీ, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజలకు మరింత ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన వావిలాల వెంకట రమేష్, సరళాదేవి దంపతులతో పాటు క్లబ్ అధ్యక్షుడు, కార్యదర్శి, ట్రెజరర్ రమేష్ గుప్తా, ఫాస్ట్ ప్రెసిడెంట్ వావిలాల పవన్‌కుమార్‌లను ఎమ్మెల్యే అభినందించారు. వావిలాల సరళాదేవి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళలకు క్యాన్సర్ నివారణకు ఉపయోగపడే వ్యాక్సిన్‌ను తగిన వయసులో అందించడం అత్యంత ముఖ్యమైన సేవగా భావిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ నాయకులు పాపారావు నాయుడు, వావిలాల సరళాదేవి, పుట్టా విజయశ్రీ, కొట్టూరి సజని, కంబాల రంగారావు, మట్ట వెంకట్, పీవీ రమణ, వాతాడ రంగనాథ్, ఏ. బాలాజీ, ఆకురాతి శ్రీనివాస్, బత్తుల రమణ, పాలరాజు, కే. శ్యామల, ఎం. జ్యోతి, బి. సత్యశ్రీ, ఏ. అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగవంతంగా పరిష్కరించడమే ప్రత్యేక పిజిఆర్ఎస్ లక్ష్యం.....

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

మొగల్తూర్, సెప్టెంబర్ 18: ప్రజల సమస్యలను వారి వద్దకే వెళ్లి నేరుగా తెలుసుకుని, సంబంధిత అధికారుల సమన్వయంతో వాటిని వేగవంతంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు పర్యటనలు కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శుక్రవారం మొగల్తూరు ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి లో నిర్వహించిన 2 వ ప్రత్యేక పి జి ఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, స్థానిక శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి ప్రజలతో నేరుగ మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులను జరిగిందన్నారు. నియోజకవర్గ స్థాయిలో వచ్చిన ప్రజల నుండి 124 ఫిర్యాదులను స్వీకరించారు. వాటికి సంబంధిత అధికారులకు అందజేస్తూ సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పదేపదే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా, పిజిఆర్ఎస్ ద్వారా వారి సమస్యలను స్వీకరించి నిర్ణీత సమయంలో పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని సూచించారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలను పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కారం చూపాలని ఆదేశించారు.ఏ సమస్య ఏ శాఖకు సంబంధించినదో గుర్తించి, సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. పి జి ఆర్ ఎస్ లో అందిన ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్ లో నమోదు చేసి, దాని పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఫిర్యాదుదారునికి సమస్య పరిష్కారంపై స్పష్టమైన సమాచారం అందించాలని, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడం, ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడం, సమస్యలకు సత్వర పరిష్కారం చూపడం అధికారుల ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రత్యేక పిజిఆర్ఎస్ కార్యక్రమానికి హాజరైన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. నియోజకవర్గంలో చేయవలసిన అభివృద్ధి పనులు పై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు రాబోయే పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని రహదారుల అభివృద్ధి పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని కోరారు.

స్వీకరించిన ఫిర్యాదులు కొన్ని

- మొగల్తూరు మండలం జెట్టిపాలెం గ్రామానికి చెందిన చిర్ల వెంకట సుబ్బలక్ష్మి తన భర్త నుంచి విడాకులు పొంది ఒంటరిగా జీవిస్తున్నాను ఒంటరి మహిళ పింఛన్ మంజూరు చేయాలని కోరారు.
- నరసాపురం మండలం చామకూరిపాలెం పంచాయతీ కొండవీటి కొడప గ్రామానికి చెందిన ఆచంట సత్యనారాయణ తన రేషన్ కార్డులో చిన్న కుమార్తెతో పాటు ఆమె భర్త, అత్తగారి పేర్లు కూడా నమోదై ఉన్నాయని దీంతో తాను పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నప్పుడు అనర్హుడిగా చూపిస్తున్నారని తన రేషన్ కార్డు నుండి వారి పేర్లను తొలగించి, అర్హత మేరకు తనకు పింఛన్ మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
- మొగల్తూరు పంచాయతీ పరిధిలోని నక్కవారిపాలెం, పడమటిపాలెం గ్రామాలకు చెందిన కె.వి. సత్యనారాయణ, ఐ. దుర్గారావు, కె. ఆనందరావు తదితరులు6 మొగల్తూరు నుంచి పడమటిపాలెం, కొత్తపాలెం మీదుగా భీమవరం వెళ్లే ప్రధాన రహదారి మరియు మొగల్తూరు గొల్లగూడెం నుంచి నక్కవారిపాలెం వెళ్లే అడ్డరోడ్డు పూర్తిగా పాడైపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు రహదారులను నిర్మించి గ్రామ ప్రజల ఇబ్బందులను తొలగించాలని కోరారు
- నరసాపురం మండలం సీతారామపురం గ్రామం కొత్తపేటకు చెందిన తమనం రాజేశ్వరి తనకు ఐదు సెంట్ల ఇంటి స్థలం ఉందని తెలిపారు. తన ఇంటి స్థలానికి సంబంధించిన సరిహద్దు గోడపై సరిహద్దుదారులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని ఆమె కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అక్రమ నిర్మాణాలను పరిశీలించి తొలగించి, తనకు న్యాయం చేయాలని ఆమె కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ దాసిరాజు, డి పి ఓ దోసిరెడ్డి, స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు జిల్లా అధికారి ఎ వెంకట లక్ష్మీ, తాసిల్దార్లు ఎండి అబ్దుల్ ఫరూక్ , నాగార్జున, ఎంపీడీవో సి హెచ్ త్రిశూలపాణి, నరసాపురం నియోజకవర్గం టి డి పి ఇన్చార్జి పొత్తూరి రామరాజు,వివిధ శాఖల జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పనీర్ నమూనాలు సేకరణ.. కేఎఫ్‌సీలో నాణ్యత తనిఖీలు

తణుకులో అధిక టీపీసీ నమోదుతో కేసు నమోదు

తణుకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం) డైరెక్టర్, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు తణుకు, తాడేపల్లిగూడెం పట్టణాల్లో ఆహార నాణ్యతపై అధికారులు తనిఖీలు నిర్వహించారు. తాడేపల్లిగూడెం, తణుకులోని డీ-మార్ట్‌తో పాటు తాడేపల్లిగూడెంలోని మిల్క్ సెంటర్లలో పనీర్ నాణ్యతను పరిశీలించారు. పనీర్‌లో వెజిటబుల్ ఆయిల్, పిండి పదార్థాలు లేదా ఇతర హానికర పదార్థాలు కలిసే అవకాశం ఉందన్న అనుమానంతో నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబొరేటరీకి పంపినట్లు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఏఎస్ఆర్ రెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఆధ్వర్యంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా తణుకులోని కేఎఫ్‌సీలో ఉపయోగిస్తున్న వంట నూనెను అధికారులు తనిఖీ చేశారు. నూనెలో టోటల్ పోలార్ కాంపౌండ్స్ (టీపీసీ) రీడింగ్ 25 వరకు ఉండాల్సి ఉండగా, 38గా నమోదైనట్లు అధికారులు తెలిపారు. దీంతో సంబంధిత సంస్థపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఆర్ రెడ్డి పేర్కొన్నారు.

ధాన్యం మద్దతు ధర కొనుగోలుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

ఈ నెల 25లోగా ఈ-క్రాప్, ఈ-కేవైసీ 100 శాతం పూర్తి చేయాలి: జిల్లా జాయింట్ కలెక్టర్ కె ఆర్ కల్ప శ్రీ

భీమవరం, ఖరీఫ్ 2026--27 సీజన్‌లో రైతుల నుంచి ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు సజావుగా కొనుగోలు చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో వ్యవసాయ, పౌరసరఫరాల శాఖల అధికారులతో ధాన్యం కొనుగోలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కామన్ వెరైటీ ధాన్యం క్వింటాల్‌కు రూ.2,441, గ్రేడ్--ఏ రకానికి రూ.2,461 కనీస మద్దతు ధరగా నిర్ణయించినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు మూడు రోజుల్లో సెల్ఫ్ డిక్లరేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని, తూనికలు, కొలతల పరికరాలను పరిశీలించి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం కొలిచే మీటర్ల పరిశీలన, ధృవీకరణ ప్రక్రియను పది రోజుల్లో పూర్తి చేయాలన్నారు. రైస్ మిల్లర్లు తమ డిక్లరేషన్ ప్రక్రియను మూడు రోజుల్లో ఆన్‌లైన్‌లో పూర్తి చేయాలని సూచించారు. ధాన్యం రవాణాకు వినియోగించే వాహనదారులు కొనుగోలు కేంద్రాల్లో వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ధాన్యం ధరతో పాటు రవాణా చార్జీలను కూడా ప్రభుత్వం చెల్లిస్తుందని జేసీ స్పష్టం చేశారు. జిల్లాలో ఈ-క్రాప్ 87 శాతం , ఈ-కేవైసీ 71 శాతం మాత్రమే పూర్తయిందని, ఈ నెల 25లోగా 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులకు మద్దతు ధరపై వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎం ఇబ్రహీం, డీఎస్ఓ ఎన్. సరోజ, డీఏఓ జి. సునీత, డీసీఓ ఎస్. మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధితో 57 కుటుంబాలకు ఆర్థిక భరోసా....

రూ.48.55 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు, సెప్టెంబర్ 18: ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. తణుకు నియోజకవర్గానికి చెందిన 57 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన మొత్తం రూ.48,55,285 విలువైన చెక్కులను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపద సమయంలో ప్రభుత్వం అండగా నిలవడం ద్వారా ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు కొంతమేర ఆర్థిక ఉపశమనం లభిస్తుందన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని, ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. తణుకు అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ తణుకు -- గ్రీన్ తణుకు లక్ష్యంగా పారిశుద్ధ్య పరిశీలన.....

పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు, 18: స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా 'క్లీన్ తణుకు--గ్రీన్ తణుకు' థీమ్‌తో తణుకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పర్యటించి పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. పట్టణ ప్రజలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా స్థానిక పరిస్థితులను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణలో అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. పర్యటన సందర్భంగా ఎమ్మెల్యే స్థానిక ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ ప్రాంతంలో ఎమ్మెల్యే ఆకస్మికంగా పర్యటించి సమస్యలను తెలుసుకోవడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించడంలో ప్రజల భాగస్వామ్యం కూడా కీలకమని పేర్కొన్నారు.

ఈ నెల 23న భీమవరంలో 5కే రెడ్ రన్ మారథాన్......

యువతలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడమే లక్ష్యం

భీమవరం, సెప్టెంబర్ 18: యువతలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌తో పాటు లైంగిక వ్యాధులపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ నెల 23వ తేదీన భీమవరంలో 5కే రెడ్ రన్ మారథాన్ నిర్వహించనున్నట్లు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ అధికారి ఎం. రవికుమార్ తెలిపారు. ఈ 5కే రెడ్ రన్ మారథాన్ ఉదయం 6 గంటలకు భీమవరంలోని డీఎన్ఆర్ కళాశాల మైదానం వద్ద ప్రారంభమవుతుందని తెలిపారు. 17 నుంచి 25 సంవత్సరాల వయస్సు కలిగిన యువత, యువకులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు. యువతీ, యువకుల విభాగాల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.10,000, రెండో బహుమతిగా రూ.7,000 చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు వెల్లడించారు.

గత సంవత్సరం నిర్వహించిన రెడ్ రన్‌లో బహుమతులు పొందిన వారు ఈ సంవత్సరం పోటీలో పాల్గొనేందుకు అనర్హులని తెలిపారు. పాల్గొనే వారు తప్పనిసరిగా విద్యార్థులై ఉండాలని, విద్యార్థి గుర్తింపు కార్డుతో హాజరు నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని ఇంటర్, డిగ్రీ, పీజీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, వ్యాయామ విభాగాధిపతులు తమ విద్యార్థులను ప్రోత్సహించి 5కే రెడ్ రన్ మారథాన్‌లో పాల్గొనేలా చూడాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ అధికారి ఎం. రవికుమార్ కోరారు. మరిన్ని వివరాల కోసం జి.వి.కె. మూర్తి -- 9494566111 నంబర్‌లో సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

ప్రభుత్వం నుంచి బయటకొచ్చి మాట్లాడితేనే ప్రజలు నమ్ముతారు

పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జోగాడ ఉమామహేశ్వరరావు



పాలకొల్లు, ప్రభుత్వంలో కొనసాగుతూ చేసే ప్రకటనల కంటే ప్రభుత్వం నుంచి బయటకు వచ్చి మాట్లాడితేనే ప్రజలు విశ్వసిస్తారని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జోగాడ ఉమామహేశ్వరరావు అన్నారు. భవిష్యత్ ఎన్నికల్లో వైసీపీతో, టీడీపీతో పొత్తు ఉండదంటూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. రాష్ట్రంలో మూడో ప్రత్యామ్నాయ పార్టీగా జనసేన ఎదిగినప్పటికీ, టీడీపీతో పొత్తు కారణంగా ఆ పార్టీ ఉనికి కోల్పోయిందని ఉమామహేశ్వరరావు విమర్శించారు. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ టీడీపీతో కలిసి ప్రభుత్వంలో కొనసాగుతున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో అవకతవకలు జరిగాయని, నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఎన్నికల ప్రచార సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబుతో కలిసి పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజల్లో ఇరువురు నేతలపై వ్యతిరేకత పెరుగుతోందని అన్నారు. తిరుపతిలో పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుత సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నంగా కనిపిస్తున్నాయని ఉమామహేశ్వరరావు వ్యాఖ్యానించారు.

బాలికపై గ్యాంగ్ రేప్.. హత్య.. మృతదేహాన్ని పీక్కుతిన్న కుక్కలు

బీజేపీ పాలిత ఢిల్లీలో మరో ఘోరం నిందితుల్లో ముగ్గురు మైనర్లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 : బీజేపీ అధికారంలో ఉన్న దేశ రాజధాని ఢిల్లీలో మరో దారుణ ఘటన వెలుగుచూసింది. 17 ఏండ్ల బాలికను నలుగురు వ్యక్తులు గ్యాంగ్ రేప్ చేసి, దారుణంగా హత్య చేశారు. తర్వాత ఆమె మృతదేహాన్ని ఒక బహిరంగ ప్రదేశంలో పారేయడంతో కుక్కలు ఆమె శవాన్ని పీక్కుతిన్నాయి. హత్యాచారం జరిగిన కొన్ని రోజుల తర్వాత కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం ఈ నెల 13న పోలీసులకు లభ్యమైంది. ఛిద్రమై కుళ్లిపోయి ఉన్న మృతదేహం ఆడోమగో కూడా తెలియని స్థితిలో వాయువ్య ఢిల్లీలోని కుషాక్ రోడ్ స్వరూప్‌నగర్‌లో జైపాల్ రాణా పొలంలో తమకు లభ్యమైనట్టు వారు చెప్పారు. అప్పటికే మృతురాలి శరీరంలోని కొన్ని భాగాలను కుక్కలు పీక్కుని తిన్నాయన్నారు. ఒక చేయి శరీరం నుంచి వేరు చేసి ఉందన్నారు. నిందితులు, బాలిక ఒకరికొకరు తెలిసిన వారేనని, నేరం జరిగిన రోజు నిందితులు, బాలిక టెంపోలో కలిసి ప్రయాణించారని, అందులోనే అందరూ తాగారని చెప్పారు. తర్వాత ఆ బాలికపై నలుగురూ అత్యాచారం చేసి, అనంతరం కత్తులతో పొడిచి చంపి, శవాన్ని ఒక పొలంలో పడేసి వెళ్లిపోయారు. ఆ బాలిక అదృశ్యమైనట్టు ఆమె కుటుంబ సభ్యులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. ఇంట్లోంచి తరచూ బయటకు వెళ్లి కొన్ని రోజుల తర్వాత తిరిగి రావడం ఆమెకు అలవాటని, అందుచేత ఆమె కన్పించకపోయినా తాము పట్టించుకోలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఘటనా స్థలిలోని 50 కు పైగా కెమెరాలను పోలీసులు పరిశీలించగా, ఒక టెంపో అనుమానాస్పదంగా కన్పించింది. 15,16 తేదీల్లో విస్తృత గాలి ంపు జరిపి ఆ టెంపోను గుర్తించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా, ఆ ఘటనలో నలుగురి ప్రమేయం గురించి బయటపడింది. అందులో ముగ్గురు 16,17 ఏండ్ల మైనర్లు. హత్యకు ఉపయోగించిన రెండు కత్తులు, నిందితులు ధరించిన దుస్తులు, టెంపోను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఎల్ఐసీ నిధుల గోల్‌మాల్.. అనిల్ అంబానీపై సీబీఐ కేసు

అనిల్ అంబానీపై రూ.2,684 కోట్ల మోసం కేసు
కేసు నమోదు చేసిన కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ
ఎల్ఐసీ ఫిర్యాదుతో రంగంలోకి ఏజెన్సీ
రిలయన్స్ క్యాపిటల్ నిధులు పక్కదారి పట్టించారని ఆరోపణ

ప్రముఖ పారిశ్రామికవేత్త, రిలయన్స్ గ్రూప్ మాజీ ఛైర్మన్ అనిల్ అంబానీ మరోసారి చట్టపరమైన చిక్కుల్లో పడ్డారు. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ)కి చెందిన సుమారు రూ.2,684.57 కోట్ల నిధులను మోసపూరితంగా మళ్లించారనే ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసులో అనిల్ అంబానీతో పాటు రిలయన్స్ క్యాపిటల్ లిమిటెడ్ (ఆర్-క్యాప్), రిలయన్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ సతీశ్ సేథ్‌తో పాటు మరికొందరు గుర్తుతెలియని ప్రభుత్వ ఉద్యోగులను నిందితులుగా చేర్చారు. ఎల్ఐసీ సమర్పించిన లిఖితపూర్వక ఫిర్యాదు ఆధారంగా సీబీఐ ఈ కేసును దర్యాప్తు చేస్తోంది. 2012 ఏప్రిల్ నుంచి 2018 మార్చి మధ్య కాలంలో రిలయన్స్ క్యాపిటల్ జారీ చేసిన ఐదు నాన్-కన్వర్టిబుల్ డిబెంచర్లలో (ఎన్‌సీడీ) ఎల్ఐసీ మొత్తం రూ.3,900 కోట్లు పెట్టుబడిగా పెట్టింది. సంస్థాగత అవసరాలు, పాత రుణాల చెల్లింపుల నిమిత్తం ఈ నిధులను వినియోగిస్తామని చెప్పి, ఆపై వాటిని దుర్వినియోగం చేశారని ఎల్ఐసీ తన ఫిర్యాదులో ఆరోపించింది. నిందితులు నేరపూరిత కుట్రకు పాల్పడి, లెక్కలను తారుమారు చేయడం ద్వారా ఎల్ఐసీకి భారీ ఆర్థిక నష్టం కలిగించారని సీబీఐ పేర్కొంది. ఈ కుట్రలో ఎవరెవరి పాత్ర ఉందో తేల్చేందుకు, అలాగే మళ్లించిన నిధుల గమ్యాన్ని గుర్తించేందుకు దర్యాప్తును ముమ్మరం చేసినట్లు సీబీఐ వెల్లడించింది. ఇదిలా ఉండగా, రిలయన్స్ గ్రూప్‌కు చెందిన పలు కంపెనీలపై సీబీఐ ఇప్పటికే 8 ఎఫ్ఐఆర్‌లను నమోదు చేసింది. ఈ కేసులకు సంబంధించి ఇప్పటివరకు ఆరు ఛార్జిషీట్లు దాఖలు కాగా, ఏడుగురిని అరెస్ట్ చేసింది. ఈ పరిణామాలపై అనిల్ అంబానీ ప్రతినిధి స్పందిస్తూ, ఈ వ్యవహారం రిలయన్స్ క్యాపిటల్‌కు సంబంధించినదని తెలిపారు. 2021 నవంబర్ వరకు అనిల్ అంబానీ ఆ కంపెనీ బోర్డులో నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా మాత్రమే కొనసాగారని వివరించారు. తాము ఎటువంటి అక్రమాలకు పాల్పడలేదని, ఈ విషయంలో తమకున్న చట్టపరమైన హక్కులన్నింటినీ వినియోగించుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

మమత పార్టీ పేరు, గుర్తు గల్లంతు..

ఉప ఎన్నికల ముందు దీదీకి మరో భారీ షాక్
పోటీ నుంచి వైదొలగిన పార్టీ నందిగ్రామ్ అభ్యర్థి
ఇది చీకటి దినమని ఆరోపించిన మాజీ సీఎం

కోల్‌కతా, సెప్టెంబర్ 18 : వచ్చే నెల ఆరో తేదీన నందిగ్రామ్, రెజీనగర్ ఉప ఎన్నికలకు ముందు బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీకి గట్టి షాక్ తగిలింది. మూడు దశాబ్దాలుగా ఉన్న ఆమె పార్టీ పేరు, గుర్తు గల్లంతయ్యింది. ఆమెకు చెందిన తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ రెండుగా చీలిపోయిన క్రమంలో పార్టీ పేరు, గుర్తులను ఎన్నికల సంఘం స్తంభింప జేసింది. ఈ క్రమంలో రాబోయే ఉప ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల సంఘం మమతా బెనర్జీ, పార్టీ చీలిక వర్గానికి తాత్కాలికంగా కొత్తపేర్లు, ఎన్నికల గుర్తులను శుక్రవారం కేటాయించింది. మమతా బెనర్జీ నేతృత్వంలోని పార్టీకి 'మమతా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' అనే పేరును, పార్టీ గుర్తుగా 'ఫుట్‌బాల్ ఆటగాడి'ని కేటాయించింది. అదే సమయంలో చీలిక వర్గానికి డెమోక్రాటిక్ తృణమూల్ కాంగ్రెస్ పేరును, పార్టీ గుర్తుగా కవరును కేటాయించింది. ఈ గుర్తులు కేవలం ఉప ఎన్నికల వరకేనని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. కాగా, బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు మేలో ముగిసిన తర్వాత రితబ్రతా బెనర్జీ నేతృత్వంలో పార్టీని చీల్చి వేరే వర్గంగా ఏర్పడిన సంగతి తెలిసిందే. తమదే అసలైన టీఎంసీ అని అతను ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించడంతో ఇప్పుడు దానిపై వివాదం నడుస్తున్నది.

పోటీ నుంచి తప్పుకున్న మమత పార్టీ అభ్యర్థి

ఉప ఎన్నికలకు ముందు మమతా బెనర్జీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. అక్టోబర్ 6న జరిగే నందిగ్రామ్ ఉప ఎన్నికకు మమతా బెనర్జీ తరపున పోటీ చేయనున్న సంచితా ప్రధాన్ దే పోటీ నుంచి విరమించుకున్నారు. ముఖ్యమంత్రి సువేందు అధికారిని కలిసిన కొద్ది గంటలకే ఆమె ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. కాగా, సువేందు అధికారి భవానీపూర్, నందిగ్రామ్‌ల నుంచి ఎమ్మెల్యేగా ఎన్నిక కాగా, ఆయన నందిగ్రామ్ ఎమ్మెల్యే స్థానానికి రాజీనామా చేయడంతో అక్కడ ఉప ఎన్నిక జరుగుతున్నది.

ఇది చీకటి దినం

తన పార్టీ పేరు, గుర్తును స్తంభింపచేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన మమతా బెనర్జీ భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఇది చీకటి దినమని అభివర్ణించారు. ఎన్నికల సంఘం నిర్ణయంతో తాను పూర్తిగా విభేదిస్తున్నానని, ఈసీ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధం, అన్యాయ ం, అప్రజాస్వామికమని, పూర్తిగా వివక్షాపూరితంగా ఉందని ఆరోపించా రు. ఒక రాజకీయ పార్టీ ఇగోను సంతృప్తి పర్చడానికే ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. 29 ఏండ్లుగా ఉన్న పార్టీ గుర్తును, పేరును స్తంభింప చేయడం పట్ల ఎన్నికల సంఘంపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీని ఆమె జుమ్లా పార్టీ అని విమర్శించారు. తాను ఇండియా కూటమిలో ఉన్నానని, తమ పార్టీ కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇస్తుందని ఆమె ప్రకటించారు. తాము బీజేపీని తరిమికొట్టాలనుకుంటున్నామని, ఆ పార్టీతో పోరాటానికి సిద్ధం గా ఉన్నామని ఆమె తెలిపారు. అయితే నందిగ్రామ్‌లో తమ పార్టీ అభ్యర్థిని పోటీ కి దించమని, కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇస్తామని చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన మమతా బెనర్జీ వాస్తవానికి ఈ సీటు నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తారని భావించారు. అనూహ్యంగా ఆమె ఈ సీటుకు సంచితా ప్రధాన్ దేను అభ్యర్థిగా ప్రకటించారు. నామినేషన్ల దాఖలుకు బుధవారమే ఆఖరు తేదీ కావడంతో మమతకు మరో అభ్యర్థిని నిలిపే అవకాశం లేకుండా పోయింది.

మమత మద్దతిచ్చిన కొన్ని గంటల్లోనే కాంగ్రెస్ అభ్యర్థి అరెస్ట్

కోల్‌కతా: నందిగ్రామ్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మిలాన్ ప్రధాన్‌ను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఈ ఎన్నికల్లో తాము కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతు ఇస్తామని మాజీ సీఎం మమతా బెనర్జీ ప్రకటించిన కొన్ని గంటల్లోనే అతడిని చాలా ఏండ్ల నాటి ఒక పాత హత్య కేసులో అరెస్ట్ చేశారు. 2007లో జరిగిన నందిగ్రామ్ భూసేకరణ వ్యతిరేక నిరసనల్లో జరిగిన హత్య కేసులో అతడిని అరెస్ట్ చేసినట్టు తెలిపారు. కాగా, కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇస్తూ ప్రకటన చేయడం మమత ఇష్టమని, మద్దతు ఇవ్వాలని తామైతే ఆమెను కోరలేదని కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరి పేర్కొన్నారు.

మసీదులో ఆత్మాహుతి దాడి.. 21 మంది మృతి

ఇస్లామాబాద్ : పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రాంతంలోని ఓ మసీదులో శుక్రవారం ఆత్మాహుతి దాడి జరిగింది. ప్రార్థనలు చేస్తున్న సమయంలో ఈ దాడి జరగ్గా.. 21 మంది మృతి చెందారు. 70 మందికి పైగా గాయపడి దవాఖానలో చికిత్స పొందుతున్నారు. మృతుల్లో 15 మంది పోలీసులు కూడా ఉన్నారు. రెస్క్యూ సిబ్బంది సహాయక కార్యక్రమాలు చేపట్టారు. పలువురికి తీవ్రంగా గాయాలు కావడంతో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఈ దాడిపై ఇప్పటి వరకు ఏ ఉగ్రవాద సంస్థ ప్రకటన చేయలేదు.

యూపీఐ చార్జీలతో అమెరికా కంపెనీలకే లబ్ధి!

సువర్ణ జ్యోతి:న్యూఢిల్లీ : రూ.2,000 పైబడిన యూపీఐ లావాదేవీలపై 0.4% మర్చంట్ ఫీజు వసూలు చేయాలన్న మోదీ సర్కార్ ప్రణాళిక ఎక్కువగా అమెరికా కంపెనీలకే లబ్ధి చేకూర్చనున్నది. వాణిజ్య నిపుణుల ప్రకారం.. ఈ ఫీజు అమెరికా కంపెనీ వాల్‌మార్ట్‌కు చెందిన ఫోన్ పేకు కొత్త ఆదాయ వనరును సృష్టించడంతోపాటు త్వరలో చేపట్టనున్న ఐపీవోకు ముందు దాని విలువను పెంచే అవకాశం ఉన్నది. భారత్ ఉచిత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ, రూపే నెట్‌వర్క్ తమకు ప్రతికూలంగా మారాయని అమెరికా కంపెనీలు చాలాకాలంగా వ్యక్తం చేస్తున్న ఆందోళనలను కూడా ఈ చర్య కొంతవరకు తగ్గించవచ్చు. గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్(జీటీఆర్ఐ) పేర్కొన్న అంచనాల ప్రకారం.. యూపీఐ లావాదేవీల్లో 80 శాతానికి పైగా ఫోన్ పే, గూగుల్ పే కలిపి నిర్వహిస్తున్నాయి. అందువల్ల ఈ మార్పు ముఖ్యంగా ఈ రెండు సంస్థలకు ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉన్నది. అయితే దీని ప్రభావం యూపీఐ ఆపరేటర్లకే పరిమితం కాదు. అంతర్జాతీయ కార్డ్ నెట్‌వర్క్‌లైన వీసా, మాస్టర్‌కార్డ్ పోటీ స్థితిని కూడా ఈ మార్పు మెరుగుపరచవచ్చని జీటీఆర్ఐ వాదిస్తున్నది. యూపీఐతో పోలిస్తే కార్డ్ చెల్లింపులపై ఉండే వ్యయ వ్యత్యాసం తగ్గడమే దీనికి కారణమని చెప్తున్నది. క్రెడిట్ కార్డుకు ఎండీఆర్ 1.5% నుంచి 2.5% వరకు, డెబిట్‌కార్డుకు 0.9% వరకు ఉన్నది. కొత్త యూపీఐ రేటు 0.4% క్రెడిట్, డెబిట్ కార్డుల ఎండీఆర్ కంటే తక్కువగా ఉన్నది. భారత్‌లో సున్నా ఖర్చుతో కూడిన యూపీఐ వ్యవస్థ, చెల్లింపుల మార్కెట్‌లో రూపే స్థానం కలిసి వీసా, మాస్టర్‌కార్డ్ వంటి అంతర్జాతీయ నెట్‌వర్క్‌లను ఇప్పటివరకు ప్రతికూల స్థితితో ఉంచాయని థింక్‌ట్యాంక్ చెప్తున్నది. అయితే యూపీఐపై చార్జీలు విధించడం కార్డ్ నెట్‌వర్క్‌ల పోటీ సమీకరణాన్ని మారుస్తుందని జీటీఆర్ఐ తెలిపింది.

విదేశీల కంపెనీలకు అదనపు ఆదాయం!

ఈ నిర్ణయంపై అమెరికా ఒత్తిడి ప్రభావం చూపిందన్న వాదనలను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తిరస్కరించారు. కొత్త విధానం స్థిరమైన చెల్లింపుల వ్యవస్థను రూపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు ప్రభుత్వం తెలిపింది. అయితే భారతదేశపు పబ్లిక్ డిజిటల్ పేమెంట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఉపయోగిస్తున్న విదేశీ యాజమాన్యంలోని టెక్నాలజీ కంపెనీలకు అదనపు ఆదాయాన్ని సృష్టించడానికి భారతీయ వ్యాపారులు, వినియోగదారులు సహాయపడాలా అని జీటీఆర్ఐ ప్రశ్నించింది. యూపీఐని భారతీయ ప్రభుత్వ సంస్థలు, బ్యాంకులు అభివృద్ధి చేశాయని, అయితే జీటీఆర్ఐ పేర్కొన్న అంచనాల ప్రకారం ఇప్పుడు ఫోన్ పే, గూగుల్ పే కలిపి 80 శాతానికి పైగా లావాదేవీలను ప్రాసెస్ చేస్తున్నాయని థింక్ ట్యాంక్ పేర్కొన్నది. ప్రభుత్వ మౌలిక సదుపాయాలను ఉపయోగిస్తున్న విదేశీ ప్లాట్‌ఫామ్‌లపై భాగస్వామ్య రుసుం విధించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని జీటీఆర్ఐ వాదిస్తున్నది. భవిష్యత్తులో ఇతర యూపీఐ లేదా రూపే లావాదేవీలకు కూడా ఫీజులను విస్తరించే అవకాశం ఉన్నదని చెప్తున్నది. జీటీఆర్ఐ, భారతీయ ఫిన్‌టెక్ ప్రచురణ సంస్థ పేర్కొన్న అంచనాల ప్రకారం ఫోన్ పే యూపీఐ లావాదేవీల్లో 45 శాతం నిర్వహిస్తుండగా, గూగుల్ పే సుమారు 35 నుంచి 40 శాతం వరకు వాటాను కలిగి ఉన్నది. ఈ అంచనాల ప్రకారం లావాదేవీల పరిమాణంలో ఈ రెండు ప్లాట్‌ఫామ్‌లు కలిపి 80 శాతానికి పైగా వాటాను కలిగి ఉన్నాయి. ఫోన్ పేలో సుమారు 70 శాతం వాటా వాల్‌మార్ట్‌ది కాగా, గూగుల్ పేకు అమెరికాకు చెందిన గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ యజమాని. కొత్త ఎండీఆర్ వల్ల ఇంతకుముందు తక్కువ లేదా ఎలాంటి మర్చంట్ ఫీజు ఆదాయం రాని లావాదేవీల నుంచి చెల్లింపు యాప్‌లు ఆదాయం పొందే అవకాశం ఏర్పడుతున్నది. అయితే 0.4% మొత్తాన్ని చెల్లింపు యాప్‌లు పూర్తిగా తమ వద్ద ఉంచుకోవు. ఎండీఆర్‌ను బ్యాంకులు, చెల్లింపు వ్యవస్థలోని ఇతర భాగస్వాముల మధ్య పంచుతారు. గతంలో పరిశ్రమ అంచనాల ప్రకారం, థర్డ్ పార్టీ పేమెంట్ ప్రొవైడర్లకు సుమారు 30 శాతం, మిగిలిన మొత్తాన్ని జారీ చేసే బ్యాంకులు, అక్వైరింగ్ బ్యాంకులు పొందవచ్చని అంచనాలు ఉన్నాయి. అయితే ఫోన్ పేకు భారీ లావాదేవీల ఆధారంగా లభించే ఆదాయ పూల్‌లో కొంతభాగం కూడా ఆర్థికంగా గణనీయంగా మారవచ్చు.

వినియోగదారులపై భారం ఉండదా?

2026 ఆగస్టులో యూపీఐ 2,451 కోట్ల లావాదేవీలను ప్రాసెస్ చేసింది. వీటి విలువ రూ.29.9 లక్షల కోట్లు. ఈ లావాదేవీల్లో కొంత భాగంపై చిన్న మొత్తంలో ఫీజు విధించినా అది గణనీయమైన ఆదాయాన్ని సృష్టించే అవకాశం ఉన్నది. పరిశ్రమ, బ్రోకరేజ్ సంస్థల అంచనాల ప్రకారం.. వ్యవస్థ పూర్తిగా అమల్లోకి వచ్చిన తర్వాత వార్షిక ఎండీఆర్ ద్వారా సుమారు రూ.16,000 కోట్ల నుంచి రూ.20,000 కోట్ల వరకు ఆదాయ పూల్ ఏర్పడే అవకాశం ఉన్నది. ఈ భారం ప్రజలపై పడదని సర్కార్ ఎంతగా చెప్తున్నప్పటికీ అందుకు అవకాశాలు చాలా తక్కువ. చాలా దుకాణాలు, హార్డ్‌వేర్ షాపుల్లో ప్రస్తుతం క్రెడిట్ కార్డు వినియోగిస్తే చార్జీలను వినియోగదారుల నుంచే వసూలు చేస్తున్నారు. లేదంటే యూపీఐ ద్వారా లేదా నగదు చెల్లించమని చెప్తున్నారు. ఇప్పుడు యూపీఐపై చార్జీలు వేయడంతో ఆ భారం కూడా వినియోగదారులపైనే మళ్లించే ప్రమాదమున్నది.

రూ.2 వేలకు పైన యూపీఐని అంగీకరించొద్దు..

రాష్ట్రంలోని అన్ని పెట్రోల్ పంపుల్లో రూ.2 వేలకు పైన యూపీఐ చెల్లింపులను అంగీకరించకూడదని మధ్యప్రదేశ్ పెట్రోల్ పంప్ డీలర్ల సంఘం నిర్ణయించింది. యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ చార్జి విధించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకొన్నట్టు సంఘం తెలిపింది.

ఉమ్మడి పౌర ప్రవర్తన

'ఎవరు నేర్పేరమ్మ ఈ కొమ్మకూ, పూలిమ్మనీ రెమ్మరెమ్మకూ; ఎంత తొందరలే హరి పూజకు, పొద్దుపొడవకముందె పూలిమ్మనీ'-- అంటూ ఆశ్చర్యపోతారు దేవులపల్లి కృష్ణ శాస్త్రి ఓ సినీగీతంలో! నిజమే, పూలిమ్మని రెమ్మరెమ్మనూ ఎవరు శాసించారు, ఏ చట్టం కొట్టి చెప్పింది? సృష్టిలోని సకలజీవులూ ఒకరికొకరు సహకరించుకుంటూ, ఒకరినొకరు గౌరవించుకుంటూ ఉమ్మడిగా సుఖజీవనం సాగించడానికి ప్రకృతి చేసిన ఏర్పాట్లలో ఒకటి కదా అది! పట్టిచూస్తే తప్ప అర్థం కాని, మన అవగాహనకు అందని ప్రకృతి విశాల ప్రణాళికలో అది భాగం కదా! బుర్రలేదనుకునే పక్షీ, పశువూ, చెట్టూ, పుట్టా, రాయీ, రప్పా సైతం ప్రాకృతిక న్యాయంలో భాగమైనప్పుడు బుర్ర ఉందనుకునే మనిషి ఎందుకు కాడు?! సంస్కృతీ, నాగరికతా మార్గంలో వేల సంవత్సరాల ప్రస్థానం తర్వాత, ఇప్పటికైనా అయ్యాడా? అందులో ప్రకృతి ప్రణాళికకు పెడగా పడిన అడుగులెన్ని! జీవం మనిషిగా ఎదిగిన మొదట్లో చట్టాలు లేవు; మనుగడలో భాగంగా సాటి మనిషితో జతకట్టాడు, గుంపుగా ఎదిగాడు, అనేక గుంపులతో కలిసి సామరస్యంగా సహజీవనం చేసే స్థాయికి చేరాడు. తన అస్తిత్వంలో ఎక్కువకాలం అలిఖిత శాసనాలే మనిషిని నడిపించాయి; మంచీ, మర్యాదా మప్పాయి; నీతీ, రీతీ నేర్పాయి; సభ్యత, శుభ్రత అలవరచాయి. అయినా ఇప్పటికీ ఆ ప్రక్రియ పూర్తి కాలేదు. అవినీతి, అసభ్యత, అక్రమాల అధఃపాతాళపు లోతులు చూస్తూనే ఉన్నాడు. ప్రకృతిమార్గం నుంచి తప్పుకుని సృష్టికి ప్రతిసృష్టి చేసే ప్రావీణ్యం విర్రవీగడమే అందుకు కారణమా?! మానవ జనావాసాలు గుంపు దశనుంచి నగరాలుగా ఎదిగే క్రమంలో లిఖిత శాసనాలు వచ్చాయి. అయిదువేల సంవత్సరాల క్రితం ప్రాచీన సుమేరు నాగరికతా కాలంలో తెచ్చిన 'ఉర్--నమ్ము' అనే శిక్షాస్మృతిని తొలి స్మృతిగా చెబుతారు. ఆ తర్వాత క్రీ.పూ. 1750లో, బాబిలోనియా పాలకుడు హమ్మురాబి పేరిట శిక్షాస్మృతి వచ్చింది. ఆ తర్వాత క్రీ.పూ. 451లో 'లా ఆఫ్ ట్వెల్వ్ టేబుల్స్' పేరిట రోమన్ చట్టాలు వచ్చాయి. వాటిని క్రోడీకరిస్తూ క్రీ.శ. 529లో జెస్టీనియన్ శిక్షాస్మృతిని తెచ్చారు. ఆధునిక పౌరచట్టాలనూ, వ్యవస్థలనూ అదే ప్రభావితం చేసిందంటారు. మన దగ్గర క్రీ.పూ. 400లో అర్థశాస్త్రం, ఆ తర్వాత మనుస్మృతితో సహా వివిధ స్మృతులు వచ్చి మానవ ప్రవర్తనను కట్టడి చేయడానికి ప్రయత్నించాయి. కులమతవర్గ భేదాలను దాటుకుంటూ ప్రజాస్వామ్యం దిశగా అడుగువేస్తున్న వర్తమానంలో ఈ ప్రాచీన స్మృతులు మంచి--చెడుల కలబోతగా కనిపించ డంలో ఆశ్చర్యం లేదు. క్రీస్తుశక ప్రారంభంలో మౌర్యచక్రవర్తి అశోకుడు 'ధర్మస్తంభా'ల పేరిట దేశమంతటా స్థాపించిన లిఖిత శిలాస్తంభాలు జంతుబలుల నిషేధంతో సహా ఆయా విధినిషేధాలను శాసిస్తూనే; సత్కార్యాలను, దయను, దాతృత్వాన్ని, సత్యనిష్ఠను, పరిశుద్ధతను బోధించాయి; క్రౌర్యాన్ని, కోపాన్ని, గర్వాన్ని విడిచిపెట్టమనీ; అన్ని మతా లను, పంథాలను గౌరవించమనీ చెప్పాయి. మనిషి ప్రవర్తనను చట్టాలూ, శిక్షలతోనే కాదు; తగిన హితబోధతో మానసిక పరివర్తన ద్వారా కూడా కట్టడి చేసే ప్రయత్నం ముందునుంచీ జమిలిగా సాగింది. ప్రభుత్వాలు చట్టాలు, శిక్షలతో చేయబోయిందే -- వేదాలూ, కావ్యేతిహాసాలు సహా ప్రపంచ వాఙ్మయమంతా హితబోధతో చేయబోయింది. అందుకే ప్రత్యేకించి కావ్యాలను కాంతాసమ్మితాలన్నారు. 'భగవంతుడు ఆకలిచావును విధించలేదు, తిండి ఉన్నవాడు కూడా చావక తప్పదు; తనకున్నదాన్ని ఇతరులతో పంచుకునేవాడు ఎప్పటికీ అణ గారడు; దాతృత్వం లేనివాడు ఒంటరి అయిపోతా'డంటుంది ఋగ్వేదం. దయ, ధర్మం లేని కొంప కొంపే కాదంటుంది. విజ్ఞతా, వినయాలే తప్ప అహంకారం, ధిక్కారం పని చేయవని మహాభారతంలోని యక్షప్రశ్నల ఘట్టం చెబుతుంది. ఒక యక్షుడికి చెందిన చెరువులో నీళ్ళు తాగబోయి, అతని ప్రశ్నలకు జవాబు చెప్పడానికి నిరాకరించి, ధిక్కరించి తన నలుగురు సోదరులూ స్పృహ కోల్పోయినప్పుడు ధర్మరాజు వినమ్రంగా జవాబు చెప్పి సోదరులను బతికించుకుంటాడు. కనుక చట్టాలకూ, హితబోధకూ మధ్య సమతూకం తప్పనిసరి. ఏది ఎక్కువైనా సత్ప్రవర్తన గల్లంతవుతుంది. చట్టాలే సర్వస్వ మనుకుంటే వాటి ఉల్లంఘనా సర్వసామాన్యమవుతుంది. ఉమ్మడి పౌరస్మృతులతో పాటు హితమార్గంలో ఉమ్మడి పౌర ప్రవర్తనను తీర్చిదిద్దడమూ అంతే అవసరం.

మణిపూర్‌ను చక్కదిద్దలేరా!

గత మూడేళ్లుగా అనుచిత కారణాలవల్లే ఎప్పుడూ వార్తల్లో ఉంటున్న మణిపూర్ మళ్లీ ప్రతీకారేచ్ఛతో రగులుతోంది. 2023 మేలో మొదలైన జాతుల ఘర్షణలు ఎప్పుడూ పెద్దగా ఆగిందేమీ లేదుగానీ... మీడియాలో ప్రముఖంగా వచ్చేంత పెద్ద సంఘటనలు జరగలేదు. కానీ ఆ స్వల్పకాల నిశ్శబ్దం కాస్తా గత ఆదివారం బద్దలైంది. ఆ రోజు తమెంగ్లాంగ్ జిల్లాలోని టోలెన్ గ్రామంలో వేకువజామున ఒక మహిళతో సహా నలుగుర్నిదుండగులు కాల్చిచంపారు. అటుతర్వాత సాయంకాలం అదే జిల్లాలో లోంగ్పి అనే గ్రామంలో ఒక యువకుణ్ణి, మహిళను కాల్చిచంపారు. మొదటి దాడి కుకీ ప్రాబల్య గ్రామంలో నాగాలే లక్ష్యంగా జరిగితే, రెండో దాడి నాగాలు మెజారిటీగావున్నచోట కుకీలపై జరిగింది. 1992--97 మధ్య కుకీ--నాగాల ఘర్షణల్లో బలైనవారి స్మారకార్థం ఆదివారం కుకీలు 'బ్లాక్ డే' పాటించిన రోజునే ఈ రెండు దాడులూ చోటుచేసుకోవడం గమనించదగింది. మణిపూర్ పలు జాతులకు నిలయం. ఇన్ని దశాబ్దాల పాలనలో భిన్న రాజకీయపక్షాల నాయకులు గద్దెనెక్కినా, ఏ ఒక్కరూ ఆ జాతులమధ్య సామరస్య వాతావరణాన్ని నెలకొల్పలేకపోయారు. 2023 నాటి ఘర్షణల సమయంలో అప్పటి బీజేపీ ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ప్రధాన తెగలైన మెయితీ--కుకీల మధ్య పరస్పర హననం సాగుతుంటే, దాన్ని భద్రతా బలగాలకూ, కుకీ మిలిటెంట్లకూ మధ్య సాగుతున్న ఘర్షణగా చిత్రించే యత్నం చేశారు. చివరకు భద్రతా బలగాలే బీరేన్ సింగ్ ప్రకటనను ఖండించాల్సి వచ్చింది. ఆ ఘర్షణల్లో దాదాపు 300 మంది మరణించగా, 60,000 మంది నిరాశ్రయులయ్యారు. ఇప్పటికీ వారిలో చాలా మంది సహాయ శిబిరాల్లోనే బిక్కుబిక్కుమంటూ బతకాల్సి వస్తోంది. కొందరు ఇప్పుడిప్పుడే గ్రామాలకు వెళ్తున్న తరుణంలో మళ్లీ హింస చెలరేగింది. మెయితీల ఆధిక్యతగల ఇంఫాల్ లోయలో 2023లో వారివైపు నుంచి హింస మొదలైనప్పుడు అదుపు చేయగలిగి ఉంటే సమీప కొండ ప్రాంతాల్లోని కుకీలు రెచ్చిపోయేవారు కాదు. అయితే మూడేళ్లనాటి హింసకూ, ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి సాగుతున్న హింసకూ మౌలికంగా వ్యత్యాసం ఉంది. అప్పట్లో వందలమంది గుంపులుగా ఊళ్లపైబడి దాడులు చేశారు. ఇళ్లకు నిప్పంటించటం, మహిళలపై అత్యాచారాలకు పాల్పడటంవంటివి చోటు చేసుకున్నాయి. కానీ ఇప్పుడు చడీచప్పుడూ లేకుండా వచ్చి దాడులు చేసి పోతున్నారు. అలాగే మొన్నటివరకూ ప్రధానంగా మెయితీ--కుకీ తెగలమధ్యే ఘర్షణలుండగా, మూడు దశాబ్దాల క్రితం నాటి ఉదంతాలను గుర్తు తెస్తూ ఇప్పుడు కుకీ--నాగా జాతులమధ్య వైరం సాగుతోంది. మెయితీలు తమను సైతం గిరిజనులుగా గుర్తించాలని డిమాండ్ చేయగా, దాన్ని కుకీలు వ్యతిరేకించారు. ఇప్పుడు కుకీలు, నాగాలూ క్రైస్తవులే అయినా వారిమధ్య భూమి విషయంలో కొట్లాటలు సాగుతున్నాయి. బీరేన్ సింగ్ ప్రభుత్వం పోయి, కొన్నాళ్లు రాష్ట్రపతి పాలన కొనసాగి మొన్న ఫిబ్రవరిలో ఖేమ్‌చంద్ సింగ్ ఆధ్వర్యంలో కొత్త సర్కారు ఏర్పడింది. నిండా రెండునెలలు కూడా ప్రశాంతత లేకుండా నాగా--కుకీలమధ్య ఘర్షణలు మొదలయ్యాయి. ఒక మహిళపై అత్యాచారం కూడా చోటుచేసుకుంది. ఇవన్నీ సహాయ శిబిరాల్లో జరిగినవే. ఈ ఉదంతాలపై సమగ్ర నివేదిక కావాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం గురువారం ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మరణాలపై లోగడే సర్వోన్నత న్యాయస్థానం త్రిసభ్య సంఘాన్ని నియమించగా, ఆ సంఘం 25 అసహజ మరణాలను ప్రస్తావించింది. వీటిపై జూన్ 11నుంచి వివరణ కోరుతున్నా, ఇంతవరకూ జవాబులేదని ఆ సంఘం చెప్పటంపై ధర్మాసనం దిగ్భ్రాంతి వ్యక్తంచేసింది. మృతుల వారసులకు అరకొర ఆర్థికసాయం అందించటంపైనా నిలదీసింది. మొత్తంగా 8 జిల్లాల్లోని శిబిరాల్లో 640 మంది మరణించగా, అందులో 34 మంది మరణాలు అసహజమైనవని తేలింది. కానీ 25 మృతదేహాలకు మాత్రమే పోస్టుమార్టం జరిపించారు. ఈ వరస చూస్తుంటే పాలకులు మారినా మారిందేమీ లేదని అర్థమవుతోంది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్రాలు సమగ్రంగా చర్చించుకుని తగిన కార్యాచరణకు దిగనట్టయితే అక్కడ శాంతిభద్రతలు మరింత క్షీణించటం ఖాయం.

కార్పొరేట్లకు రైటాఫ్

స్విస్ బ్యాంకుల నుంచి నల్లధనాన్ని తీసుకువచ్చి దేశప్రజలకు తలా పదిహేను లక్షలు పంచుతామని చెప్పిన బీజేపీ సర్కార్ ఆ హామీని గాలికి వదిలేసి సుమారు 12 సంవత్సరాలైంది. బయటి దేశాల్లోని నల్లధనం తేవటం అటుంచి, గత పన్నెండేండ్లుగా ఇక్కడి బ్యాంకుల్లోని తెల్లధనాన్ని అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్టు కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నది. మోదీ సర్కార్ అధికారంలోకి వచ్చిన 2014 నుంచి ప్రస్తుత 2026 వరకు అచ్చంగా పది లక్షల కోట్ల కార్పొరేట్ల రుణాలను 'రైటాఫ్' చేసినట్టు స్వయంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా లోక్‌సభకు వెల్లడించింది. విద్య, వైద్య, వ్యవసాయం వంటి కీలక రంగాలపై పెట్టుబడులకు చేతులు రాని కేంద్రం సర్కార్ కార్పొరేట్ కంపెనీలకు మాత్రం రైటాఫ్ రూపంలో లక్షల కోట్లు చెల్లించుకుంటుండటం విడ్డూరం. చిన్న రుణగ్రహీతల నుంచి బకాయిలు ముక్కుపిండి వసూలు చేసే బ్యాంకులు ఇలా బడాబాబులకు ప్రజాధనాన్ని దోచిపెట్టడం ఏమిటనేది ప్రశ్న. సన్నకారు రైతులు, స్వయం ఉపాధిదారులు, మధ్య తరగతి కుటుంబాలు బ్యాంకు రుణం కట్టలేకపోతే బ్యాంకు అధికారులు నోటీసులు పంపి, ఆస్తుల స్వాధీనం వంటి కఠిన చర్యలను తీసుకుంటారు. వీటివల్ల క్రెడిట్ స్కోర్ దెబ్బతినడం అనే సమస్య మెడ మీద కత్తిలా వేలాడుతూ ఉంటుంది. బ్యాంకు వేల కోట్ల రుణాలు తీసుకున్న కార్పొరేట్ కంపెనీలు ఎగవేసిన రుణాలను రైటాఫ్ పేరిట వదిలేసుకోవటం ఏమిటనేది సామాన్య ప్రజల ప్రశ్న. అయితే, రైటాఫ్ అంటే పూర్తిగా రుణమాఫీ అని కాదని, కేవలం బ్యాంకుల బ్యాలెన్స్ షీట్ల నుంచి సదరు రుణాలను తొలగిస్తారు. ఇదొక సాంకేతిక ప్రక్రియ మాత్రమేనని అధికారవర్గాలు ఈ చర్యను సమర్థించుకుంటున్నాయి. రైటాఫ్ చేసినప్పటికీ సదరు రుణాల వసూలు ప్రక్రియ యథావిధిగా కొనసాగుతుందని ప్రభుత్వం నమ్మబలుకుతున్నది. కానీ ఆచరణలో రైటాఫ్ చేసిన రుణాల్లో ఎంత శాతం వెనక్కి వచ్చాయో మాత్రం వెల్లడించరు. ఈ రైటాఫ్‌లు 2018-19లో గరిష్ఠంగా రూ.1,48,753 కోట్లుగా ఉంటే 2025-26 నాటికి కనిష్ఠంగా రూ.20,485 కోట్లుగా నమోదయ్యాయి. ఈ రైటాఫ్స్ వల్ల బ్యాంకులపై పడే భారాన్ని అంతిమంగా నియమబద్ధంగా పన్నులు చెల్లించే పౌరులపైనే రుద్దుతారు. ఇదే విషయాన్ని విమర్శకులు 'ప్రైవేట్ లాభాలుపబ్లిక్ నష్టాలు' అని అభివర్ణిస్తుంటారు. ఆర్థిక వ్యవస్థలో బ్యాంకులది కీలక పాత్ర. దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థను బీజేపీ సర్కార్ ఎలా నిర్వహిస్తున్నదీ ఈ తతంగం తెలియజేస్తున్నది. ఈ రుణాల మంజూరు సమయంలో పాటించిన ప్రమాణాలు, బ్యాంకుల బాధ్యత, ప్రభుత్వ పర్యవేక్షణ.. ఇవన్నీ ఇప్పుడు ప్రశ్నార్థకమవుతున్నాయి. ఎలాంటి పూచీకత్తులు, ఏయే అంచనాలతో ఈ భారీ రుణాలు ఇచ్చారు? వాటిపై కఠినమైన పర్యవేక్షణ ఎందుకు విఫలమైంది? డిఫాల్ట్‌లకు బాధ్యులెవరు? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు లేకపోవడం ప్రభుత్వ చర్య మీద అనుమానాలను పెంచుతున్నది. ప్రభుత్వం తరచూ 'బ్యాంకింగ్ రంగాన్ని బలోపేతం చేశాం', 'ఎన్‌పీఏలు తగ్గించాం' అని చెప్పుకొంటున్నది. కానీ ఈ తగ్గుదలలో భాగంగా ఇంతింత పెద్ద మొత్తంలో రుణాలను రైటాఫ్ చేస్తే, అది నిజమైన పరిష్కారమా లేదా గణాంకాల మాయాజాలమా? అని ఆలోచించాల్సిన విషయం. బ్యాలెన్స్ షీట్లలో సంఖ్యలు మెరుగుపడవచ్చు. కానీ మూల సమస్య అయిన రుణాల వసూలు తక్కుతూ తారుతూ సాగుతుంటే దీర్ఘకాలంలో ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం తప్పదు. కార్పొరేట్ రంగం దేశ ఆర్థికాభివృద్ధికి అవసరం అనే పడికట్టు వాదనను ఎవరూ తోసిపుచ్చరు. అయితే, పెట్టుబడులు, ఉపాధి, ఉత్పత్తి ఇవన్నీ కూడా ఆరోగ్యకరమైన కార్పొరేట్ నిర్వహణపై ఆధారపడి ఉంటాయని మరువరాదు. అదే సమయంలో ఆర్థిక నిర్వహణలో జవాబుదారీతనం, పారదర్శకత, సమానత్వం కూడా అంతే ముఖ్యం. బడాబాబులకు సడలింపులు ఇస్తూ, సామాన్యుల గోళ్లూడగొట్టి రుణాలు వసూలు చేయడం సమానత్వం అనిపించుకోదు.

మెక్సికోలో వారణాసి సీన్స్ ప్రదర్శన

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం 'వారణాసి'కోసం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీప్రియులు ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఒక వార్తను ఎస్ఎస్ కార్తికేయ పంచుకున్నారు. మెక్సికోలో జరగనున్న ఓ సినీ వేడుకలో ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. మెక్సికో వేదికగా ఏప్రిల్ 24 నుంచి 26 వరకు జరగనున్న కామిక్ కాన్ ఎక్స్‌పీరియన్స్‌లో 'వారణాసి'కి సంబంధించిన ఎక్స్‌క్లూజివ్ కంటెంట్‌ను ప్రదర్శించనున్నారు. ఈ సినిమాకు సంబంధించిన మేకింగ్ వీడియోలు, బిహైండ్ ది సీన్స్‌తో పాటు కొన్ని కీలకమైన సన్నివేశాలతో కూడిన గ్లింప్స్‌ను ప్రేక్షకులకు చూపించనున్నారు. ఈ వేడుకకు కార్తికేయ హాజరు కానుండగా.. రాజమౌళి ప్రత్యేక వీడియో సందేశంతో అక్కడి అభిమానులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో విడుదల కానుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో భారీ షెడ్యూల్ జరుగుతోంది. అంతర్జాతీయస్థాయిలో భారతీయ సినిమా సత్తాను చాటేలా ఈ సినిమాను రాజమౌళి అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందిస్తున్నారు. మహేశ్‌కు జోడీగా ప్రియాంక చోప్రా నటిస్తున్నారు.

రాకా మూవీలో దీపికదే కీ రోల్

ఆమె నటించదన్న వార్తలపై టీమ్ స్పందన

అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాకా'. భారీస్థాయిలో రూపొందుతోన్న ఈ సినిమాలో బన్నీకి జోడీగా బాలీవుడ్ నటి దీపికా పదుకొణె నటిస్తున్నారు. ఇటీవల ఆమె రెండోసారి తల్లి కానున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ సినిమాపై రూమర్స్ మొదలయ్యాయి. షూటింగ్ ఆలస్యం అవుతుందని.. దీపిక స్థానంలో మరో నటిని తీసుకోనున్నారని వార్తలు వచ్చాయి. తాజాగా వాటిని 'రాకా' టీమ్ ఖండించింది. సినిమాలో దీపిక పాత్ర నిడివి తగ్గించారనే ప్రచారాన్ని కూడా కొట్టేసింది. సినిమాలో ఆమె పాత్ర కీలకమైనదని షూటింగ్ కూడా అనుకున్న షెడ్యూల్స్ ప్రకారమే సాగుతోందని స్పష్టం చేసింది. రూమర్స్‌ను షేర్ చేయొద్దని విజ్ఞప్తి చేసింది. సన్ పిక్చర్స్ నిర్మిస్తోన్న ఈ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌లో దీపిక కొన్ని క్రేజీ యాక్షన్ సన్నివేశాల్లోనూ నటించనున్నట్లు తెలుస్తోంది. అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ ఆమె ఈ సీక్వెన్స్ చేస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో ఆమెతో పాటు మరికొందరు హీరోయిన్‌లు కూడా నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. రష్మిక, జాన్వీకపూర్, మృణాల్ ఠాకూర్ పేర్లు కూడా వినిపిస్తున్నప్పటికీ, అధికారికంగా మాత్రం ఇంకా చిత్రబృందం వెల్లడించలేదు. ఇందులో ప్రధాన పాత్రల్లో ఎవరు అతిథి పాత్రల్లో ఎవరనే విషయంపై స్పష్టత రావడానికి మరింత సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి. వచ్చే ఏడాది ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలోని లుక్ కోసం అల్లు అర్జున్ రోజూ 3, 4 గంటలు సమయం వెచ్చిస్తున్నారని సినీవర్గాలు చెప్పాయి.

రామాయణంలో రావణ, కుబేర యుద్ధం



బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారీ దర్శకత్వంలో రణబీర్ కపూర్ హీరోగా రూపుదిద్దుకుంటున్న అత్యంత భారీ బ్జడెట్ చిత్రం 'రామాయణం' గురించి ఒక సంచలన వార్త ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా రామాయణం కథ అనగానే శ్రీరాముడి బాల్యం లేదా జననంతో మొదలవుతుందని మనందరికీ తెలుసు, కానీ ఈ చిత్రంలో దర్శకుడు నితీష్ తివారీ సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాలో రావణుడిగా నటిస్తున్న కన్నడ సూపర్ స్టార్ యష్ పవర్‌ఫుల్ ఎంట్రీతో, రావణ-కుబేర యుద్ధంతో ప్రారంభం కాబోతుందని తెలుస్తుంది. తన సోదరుడైన కుబేరుడిపై దాడి చేసి, స్వర్ణ లంకను మరియు పుష్పక విమానాన్ని రావణుడు స్వాధీనం చేసుకునే ఘట్టాన్ని అత్యంత భారీ స్థాయిలో వెండితెరపై చూపించబోతున్నట్లు సమాచారం. భారతీయ సినీ చరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా సుమారు 4,000 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. ఇందులో రాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, హనుమంతుడిగా సన్నీ డియోల్ నటిస్తున్నారు. ఇటీవల లాస్ ఏంజిల్స్‌లో జరిగిన ప్రత్యేక స్క్రీనింగ్‌లో ప్రదర్శించిన 20 నిమిషాల ఫుటేజీ చూసిన విశ్లేషకులు, ముఖ్యంగా లంకా నగరం మరియు రావణుడి యుద్ధ సన్నివేశాల్లోని ఘట్టాలు హాలీవుడ్ స్థాయిని మించి ఉన్నాయని ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. రావణుడి శక్తిని, ప్రతాపాన్ని చూపే ఈ విజువల్ స్పెక్టాకిల్ మొదటి భాగం 2026 దీపావళికి, రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది.

వరుస ఫ్లాప్‌లతో శ్రీలీల డిసప్పాయింట్

హిట్‌లు లేకపోవడంతో కెరీర్‌లో ఒడిదుడుకులు

కన్నడ సినిమాలతో కెరీర్ ప్రారంభించి, టాలీవుడ్‌లో తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన శ్రీలీల ప్రస్తుతం తన కెరీర్‌లో కీలక దశను ఎదుర్కొంటోంది. ప్రారంభంలో వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని టాప్ హీరోయిన్ రేసులోకి వచ్చిన ఆమె ఇప్పుడు మాత్రం వరుస ఫలితాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు కనిపిస్తోంది. దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు దర్శకత్వంలో వచ్చిన 'పెళ్లి సందడి' సినిమాతో శ్రీలీల టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినా? ఆమెకు మాత్రం మంచి గుర్తింపు వచ్చింది. మొదటి సినిమా ఎ÷-లాప్ అయినా కూడా, ఇండస్ట్రీలో ఆమెకు వరుస అవకాశాలు రావడం విశేషం. రవితేజ సరసన నటించిన 'ధమాకా' సినిమా బ్లాక్‌బస్టర్ కావడంతో శ్రీలీల కెరీర్ ఒక్కసారిగా టర్న్ అయింది. ఆ విజయంతో ఆమె టాలీవుడ్‌లో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. వరుసగా అరడజను సినిమాలు ఆమె చేతిలో పడగా, కొన్నింటి ఫలితాలు నిరాశపరిచాయి. గత కొన్ని సంవత్సరాలుగా శ్రీలీల వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, పెద్ద హిట్ మాత్రం ఆమెకు దక్కలేదు. 'పుష్ప 2'లో చేసిన ప్రత్యేక డాన్స్ నంబర్‌తో ఇతర భాషల ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఆమెకు తమిళ, హిందీ ఇండస్ట్రీల్లో అవకాశాలు కూడా వచ్చాయి. తమిళంలో చేసిన 'పరాశక్తి' సినిమా బాక్సాఫీస్ వద్ద విఫలమైంది. దీంతో అక్కడ ఆమెకు ఆశించిన గుర్తింపు రాలేదు. ఇక హిందీలో అనురాగ్ బసు దర్శకత్వంలో చేస్తున్న సినిమా ఆలస్యం అవుతుండటం కూడా ఆందోళన కలిగిస్తోంది. ఆ ప్రాజెక్ట్ ఎప్పుడు పూర్తవుతుందో స్పష్టత లేకపోవడం గమనార్హం. ఇటీవల వచ్చిన 'ఉస్తాద్ భగత్ సింగ్'లో పవన్ కళ్యాణ్ సరసన నటించినా? సినిమాలో ఆమె పాత్రకు పెద్దగా గుర్తింపు రాలేదు. అదే సమయంలో గత ఏడాది వచ్చిన సినిమాలు కూడా కమర్షియల్‌గా పెద్ద విజయాలను అందుకోలేకపోయాయి. ప్రస్తుతం తెలుగులో పెద్దగా ప్రాజెక్టులు లేకపోవడంతో, శ్రీలీల తన భవిష్యత్తును బాలీవుడ్ సినిమాపైనే ఆధారపెట్టినట్టు కనిపిస్తోంది. ఇదిలా ఉండగా ధనుష్ హీరోగా తెరకెక్కుతున్న ఓ సినిమాలో ఆమెకు అవకాశం వచ్చిందనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన లేదు. సినీ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఈ సంవత్సరం శ్రీలీల

గీతామాధురి యూట్యూబ్ ఇంటర్వ్యూ

తెలుగు సినీ సంగీత ప్రపంచంలో తన స్వరంతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ప్రముఖ గాయని గీతా మాధురి మరోసారి వార్తల్లో నిలిచారు. పాటలతోనే కాదు, టీవీ షోలతో, సోషల్ మీడియాలో తన యాక్టివ్‌నెస్‌తో కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఆమె, తాజాగా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. గీతామాధురి ఇటీవల ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కొన్ని ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఈ ఇంటర్వ్యూకి సంబంధించిన ప్రోమో విడుదల కాగా, అందులో ఆమె చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ప్రోమోలో గీతామాధురి మాట్లాడుతూ నేను ఎప్పుడో ఒక రోజు కాఫీ షాప్‌కి వెళ్లాను. ఆ రోజే ఏదో ఒక ప్రేమ జంట అక్కడికి వస్తుంది.

Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com